Follow: @ANNTELUGU
ANN తెలుగు
23-07-2026
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 200 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

అన్నోజీగూడలో అరాచకం ఎపిసోడ్-3



## బాలరాజ్ గౌడా మజాకా..!

- ఒక్కొక్కటిగా బయట పడుతున్న మాజీ రౌడీ షీటర్ అరాచకాలు!
- మ్యూటేషన్ జరగని భూములే టార్గెట్..!
- బ్యాంకులకు బురిడీ..!
- పొజిషన్ లేని భూములను తనాఖా పెట్టి కోట్లు కొల్లగొడుతున్న వైనం ..!
- పార్టిషన్ కాలేదనే పేరుతో 86 ఎకరాలపై పెత్తనం..?
- ఇద్దరు భార్యల పేర్లపై రూ.25 కోట్లకు పైగా బ్యాంకు రుణాలు ..?
- బ్యాంకు రుణాల కోసం డబుల్ రిజిస్ట్రేషన్ల మాయాజాలం..?
- మహా పత్రిక కార్యాలయానికి క్యూ కట్టిన బాధితులు..!
- 40 అడుగుల రహదారి ఆక్రమణపై హైడ్రా ఫోకస్..!
- త్వరలో చర్యలకు రంగం సిద్ధం ..?
- రౌడీషీటర్ అరాచకంపై పోలీసుల నిఘా ఎక్కడ..?
- సీపీ మేడమ్.. ఒక్కసారి అన్నోజిగూడ వైపు చూడరా ..?

02

టాప్ న్యూస్

### సీజేపీతో చర్చలకు కేంద్రం సై



- సీజేపీతో ఎప్పుడైనా చర్చకు సిద్ధమన్న కేంద్రం.
- చర్చకు మేము రెడీ.. తేల్చుకుందాం రండి
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకే విపక్షాల పట్టు

03

### మోదీతో భేటీకి జగన్ ప్రయత్నాలు



- అపాయింట్మెంట్ కోరినట్లు ప్రచారం
- ఏపీ పాలిటిక్స్ లో చర్చ

03

### నా పై బీఆర్ఎస్ బీజేపీ కుట్ర



- నెలాఖరులోగా 100 శాతం నమోదు పూర్తి చేయాలి.
- కొడంగల్‌లో బీఎల్ఏల సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ విమర్శలు.

03

## రాహుల్ అరెస్ట్ పై రణరంగం..




### దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన జ్వాలలు.

- కొడంగల్‌లో రోడ్డెక్కిన సీఎం రేవంత్.
- భారీ ధర్నాతో కేంద్రానికి హెచ్చరిక.
- హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రి పొంగులేటి మెరుపు ఆందోళన.
- కాంగ్రెస్, బీజేపీ ఆఫీస్‌ల ముట్టడికి ఇరు వర్గాల యత్నం.. నగరంలో హైటెన్షన్.
- ఆదిలాబాద్‌లో అరెస్టుల పర్వం.. అడుగడుగునా ఉద్రిక్తత.
- నల్ల దుస్తులతో లోక్‌సభను హోరెత్తించిన కాంగ్రెస్ ఎంపీలు.
- విద్యార్థులపై లాఠీఛార్జికి వ్యతిరేకంగా స్పీకర్‌ను కలిసిన రాహుల్, ప్రియాంక.




**హైదరాబాద్, మహా :** దేశ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్ట్ వ్యవహారం దేశవ్యాప్తంగా మహాప్రకంపనలు సృష్టించింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు కన్నెర్రజేశాయి. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఎక్కడికక్కడ బ్రహ్మాండమైన నిరసనలతో దేశం దద్దరిల్లింది. విద్యార్థుల హక్కుల కోసం గొంతెత్తినందుకు అరెస్టులకు పాల్పడతారా అంటూ హస్తం శ్రేణులు కదం తొక్కడంతో భారతం అట్టుడికిపోయింది. దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ వేదికగా ఒకవైపు, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వీధుల్లో మరోవైపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**కొడంగల్‌లో గర్జించిన సీఎం రేవంత్**

రాహుల్ గాంధీ అరెస్ట్ వార్తతో తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలకు నాయకత్వం వహించారు. తన సొంత మిగతా 2వ పేజీలో

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు

- విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు
- 152 ప్రశ్నపత్రాల లీక్‌లతో 7.5 కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు.
- నీట్ లీకేజీపై కేంద్రంపై రాహుల్ గాంధీ.



**ఢిల్లీ, మహా :** దేశ విద్యా వ్యవస్థను వరుస ప్రశ్నపత్రాల లీకేజీలు తీవ్రంగా దెబ్బతీశాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు చోటు చేసుకోగా, దాదాపు 7.50 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మొత్తం వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కోరారు. పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని, పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. నిరసనలో తాను గాయపడినా బాధ లేదని, కానీ విద్యార్థుల భవిష్యత్తు నాశనం కావడం బాధ కలిగిస్తోందని అన్నారు.దేశంలో విద్య ఇప్పుడు కుటుంబాలపై భారీ ఆర్థిక భారం మోపుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక పరీక్ష కోసం విద్యార్థుల కుటుంబాలు చేసే వ్యయం, కేంద్ర ప్రభుత్వం విద్య కోసం కేటాయించే బడ్జెట్‌కు సమానంగా మారిందన్నారు. కేంద్ర విద్యా బడ్జెట్ సుమారు రూ.1.4 లక్షల కోట్లు కాగా, ప్రతి ఏడాది నీట్ పరీక్ష కోసం కుటుంబాలు దాదాపు రూ.1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇంత భారీగా ఖర్చు చేసిన తర్వాత కూడా ప్రశ్నపత్రాలు లీక్ కావడం విద్యార్థుల మిగతా 2వ పేజీలో




## అధికారుల వక్ర బాష్యం ..!

**నిషేధిత జాబితా 22 (ఎ) లో ఉన్న 4 వేల గజాల ప్రభుత్వ భూమి గల్లంతు..!**

- వందల కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల జోరు..!
- రెవెన్యూ–టౌన్ ప్లానింగ్ శాఖల వైఫల్యం బట్టబయలు..!
- కలెక్టర్‌కు ఫిర్యాదులు.. క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం..!
- ఫిర్యాదులు బుట్టదాఖలు.. బిల్డర్లకు గ్రీన్ సిగ్నల్..!
- ప్రజల ఆగ్రహానికి గురవుతున్న అధికార యంత్రాంగం..!
- అందరి చూపు హైడ్రా వైపే..!
- రంగంలోకి దిగనున్న హైడ్రా బాస్ ఏవీ రంగనాథ్..?
- ఖానామేట్ కబ్జా కథకు క్లైమాక్స్ ఎప్పుడు..?

02



ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖ, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ శాఖలు తమ బాధ్యతలను విస్మరించి వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖానామేట్ వ్యవహారంలో ఇరు శాఖల అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై వక్రభాష్యం పలుకుతున్నారన్న ఆరోపణలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత పూర్తిగా రెవెన్యూ శాఖదేనని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతుండగా...అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ శాఖదేనంటూ రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ బాధ్యతలను విస్మరించి కాలయాపన చేయడం వల్ల అక్రమార్కులకు వరంగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా సర్వే నంబర్లు 11/33,11/34 ప్రభుత్వ భూములేనని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్వయంగా 22 (ఎ) నిషేధిత జాబితాలో ఉన్నట్లు సర్క్యులర్ జారీ చేశారు. అయితే అదే స్థలంలో బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండగా పలు ఫిర్యాదులు అందినప్పటికీ జిల్లా కలెక్టర్ కూడా ముందుకొచ్చి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం స్థానిక ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది . అధికారుల మధ్య సమన్వయ లోపమా, లేక ఉద్దేశపూర్వక మౌనమా, రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ గాలికొదిలి, అక్రమార్కులకు అధికార యంత్రాంగం ప్రత్యక్షంగా సహకరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపి, ఆక్రమిత స్థలాన్ని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### గత పాలనలో ప్రజల గోడు వినేవారే లేరు



- ప్రతివారం గాంధీభవన్‌లో ప్రజలతో మంత్రుల ముఖాముఖి
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి
- 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం
- ప్రధాని మోదీ, విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02



### ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

- భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం.
- ఆగస్టు 1న కార్యక్రమానికి హాజరుకానున్న ప్రధాని.
- ఏర్పాట్ల కోసం నలుగురు ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు

02




### తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్

- అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ.
- 35 లక్షల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిన లక్ష్యం..
- రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కిషన్‌రెడ్డి సూచన.

02

# అధికారుల వక్ర బాష్యం ..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ కి కూతవేటు దూరంలో ఉన్న హైటెక్ సిటీ కూకట్పల్లి ప్రధాన రహదారి పక్కనే ఖానామెట్ బుట్టా కన్వెన్షన్ ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు మాయమవుతున్నా అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖానామేట్ లో నిషేధిత జాబితా 22 (ఏ) లో నమోదైన సర్వే నంబర్లు 11/33, 11/34 లలో సుమారు 4 వేల గజాల ప్రభుత్వ భూమి గల్లంతైందన్న ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. వందల కోట్ల రూపాయల విలువైన ఈ భూమిపై అక్రమ నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నప్పటికీ వాటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖలు మీనమేషాలు లెక్కిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నిర్మాణం ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం, ఇప్పుడు అంతస్తుల మీద అంతస్తులు పూర్తయిన తర్వాత చర్యలకు సిద్ధమవుతుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇదే స్థలం ప్రభుత్వ భూమి అని, నిర్మాణం పూర్తిగా అక్రమమని పేర్కొంటూ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి కూల్చివేతలు జరిపారు. ఇప్పుడు అదే నిర్మాణాల విషయంలో మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అప్పుడు అక్రమంగా పరిగణించిన నిర్మాణం ఇప్పుడు ఎలా సక్రమంగా మారిందని స్థానికులు నిలదీస్తున్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత గల రెవెన్యూ అధికారులు, స్వయంగా ముఖ్యమంత్రి స్వంత శాఖ అయిన మున్సిపల్ శాఖ కళ్లు మూసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఖానామేట్ వ్యవహారం అద్దం పడుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "కంచే చేను మేస్తే... కాపలాదారులే కాటేస్తే..." ప్రజలు ఎవరిని నమ్మాలంటూ ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, ఆధారాలు, రికార్డులు సంబంధిత శాఖల దృష్టికి వెళ్లినా క్షేత్రస్థాయిలో చర్యలు లేకపోవడం వెనుక అసలు కారణం ఏమిటనే



చర్చ సాగుతోంది. ఈ వ్యవహారంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖల పాత్రపై స్థానికులు బహిరంగంగానే అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.
స్థానిక మున్సిపల్ శాఖల నుంచి రెవెన్యూ అధికారుల వరకు, జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వరుస ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు కనిపించకపోవడం ప్రజలను అసహనానికి గురిచేస్తోంది. ఫిర్యాదుల వెల్లువ ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక మతలబు ఏమిటని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతుండగా, మరోవైపు ఖానామేట్ లో నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిపైనే అక్రమ నిర్మాణాలు కొనసాగడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కలెక్టర్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందినా ఫలితం కనిపించకపోవడంతో అందరి చూపు ఇప్పుడు హైడ్రా వైపే మళ్లింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ రంగంలోకి దిగితే ఖానామేట్ కబ్జా కథకు క్లైమాక్స్ తప్పదని స్థానికులు భావిస్తున్నారు.

**అవినీతి అధికారులను కోర్టుకీడుస్తాం: ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ**

ఖానామేట్ లో ప్రభుత్వ భూములపై జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. నిషేధిత జాబితా 22 (ఏ) లో ఉన్న ప్రభుత్వ భూములపైనే నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారులు మౌనం పాటించడం ఆందోళనకరమన్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేసి, ఆక్రమిత భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు స్పందించకపోతే ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)తో పాటు అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరించి కోర్టుకీడుస్తామని హెచ్చరించారు.



# రాహుల్ అరెస్ట్ పై రణరంగం..

**( మొదటి పేజీ తరవాయి )**
నియోజకవర్గమైన కొడంగల్‌లో ఆయన ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి రోడ్డెక్కి నిరసన తెలపడంతో తెలంగాణ అంతటా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేసింది. కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను, నిరంకుశ విధానాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రంగా ఎండగట్టారు.

**హైదరాబాద్‌లో మెరుపు ధర్నా.. ఢీ అంటే ఢీ!**
మహానగరం హైదరాబాద్ అసాధారణ ఉద్రిక్తతలకు వేదికైంది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నగరంలో మెరుపు ధర్నాకు దిగారు. ముందస్తు సమాచారం లేకుండా జరిగిన ఈ ఆందోళనతో నగర వీధులు దద్దరిల్లాయి.
మరోవైపు రాజకీయ వైరం భౌతిక దాడుల అంచున నిలిచింది. రాహుల్ అరెస్ట్‌కు నిరసనగా నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా దూసుకురాగా, దానికి ప్రతిగా గాంధీభవన్ (కాంగ్రెస్ ఆఫీస్) ముట్టడికి బీజేపీ నాయకులు యత్నించారు. రెండు జాతీయ పార్టీల శ్రేణులు పరస్పరం ముట్టడులకు యత్నించడంతో నగరంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

**ఆదిలాబాద్‌లో అరెస్టులు.. జిల్లాల్లో మంటలు**
హైదరాబాద్ నగరమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. జాతీయ రహదారులపై కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకోలకు దిగారు. ఆదిలాబాద్‌లో ఆందోళనలు ఉద్రిక్తంగా మారడంతో, నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు సామూహికంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఉమ్మడి జిల్లాలన్నింటిలోనూ పోలీసు బలగాలను భారీగా మోహరించారు.


**నల్ల వస్త్రాలతో లోక్‌సభలో దద్దరిల్లిన నినాదాలు**
కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనల జోరు తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్ ఎంపీలంతా నల్ల వస్త్రాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి లోక్‌సభలోకి అడుగుపెట్టారు. రాహుల్ అరెస్ట్‌ను ఖండిస్తూ సభా కార్యక్రమాలను స్తంభింపజేశారు. 'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారంటూ' ప్లకార్డులు చేతబూని స్పీకర్ పోడియం వద్ద నినాదాలతో హోరెత్తించారు. ఎంపీల ఆందోళనలతో పార్లమెంట్ పరిసరాలు మార్మోగిపోయాయి.

**స్పీకర్‌ను కలిసిన రాహుల్, ప్రియాంక**
దేశవ్యాప్తంగా ఇంతటి ప్రకంపనలకు దారితీసిన విద్యార్థుల ఇష్యూపై కాంగ్రెస్ పట్టు బిగించింది. నిరసనలు తెలుపుతున్న విద్యార్థుల మీద జరిగిన అమానుష లాఠీఛార్జి ఘటనపై లోక్‌సభలో తక్షణమే ప్రత్యేక చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇదే విషయమై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నేరుగా స్పీకర్‌ను కలిసి తమ వాదనను బలంగా వినిపించారు. విద్యార్థులపై ప్రయోగించిన లాఠీఛార్జికి కేంద్రం బాధ్యత వహించాలని, ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధపడేలా చూడాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అటు వీధుల్లోనూ, ఇటు చట్టసభల్లోనూ కాంగ్రెస్ ఒకేసారి కేంద్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడంతో దేశ రాజకీయాలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

# నా పై బీఆర్ఎస్ బీజేపీ కుట్ర

- నెలాఖరులోగా 100 శాతం నమోదు పూర్తి చేయాలి.
- కొడంగల్‌లో బీఎల్ఏల సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ విమర్శలు.

**హైదరాబాద్, మహానగర :** ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు, కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా అందకపోవచ్చని పేర్కొంటూ అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో బీఎల్ఏలు, పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
కొడంగల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 78 శాతం మంది మాత్రమే ఎస్ఐఆర్ ప్రక్రియలో నమోదు చేసుకున్నారని సీఎం తెలిపారు. మిగిలిన 22 శాతం మంది అర్హుల పేర్లు కూడా ఈ నెలాఖరులోగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారి జాబితా ఇప్పుడు రూపొందుతోందని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. రెండు పార్టీలు రాజకీయంగా వేర్వేరుగా కనిపించినా, కాంగ్రెస్‌ను బలహీనపర్చడమే వాటి ఉమ్మడి లక్ష్యమని ఆరోపించారు. కొడంగల్‌లో కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్, బీజేపీ కలిసి పనిచేశాయని ఆరోపిస్తూ, ప్రజలు ఈ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.
ఓటరు నమోదు సమయంలో వివరాలపై సందేహాలు ఉంటే తగిన ఆధారాలు సమర్పించి నమోదు చేసుకోవాలని సీఎం సూచించారు. గతంతో పోలిస్తే ఇప్పుడు పరిశీలన మరింత కఠినంగా ఉంటుందని, అందువల్ల ప్రతి అర్హుడు తప్పనిసరిగా తన పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని అన్నారు.
అనంతరం కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా కొడంగల్‌లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ర్యాలీ, ధర్నాలో పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేసేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించారని ఆరోపించిన సీఎం, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.




## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు

**మొదటి పేజీ తరువాయి**

కుటుంబాలను నిలువునా దోచుకోవడమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ సంస్థలకు మాత్రమే లాభం చేకూర్చాయని, యువత, విద్యార్థులు మాత్రం నష్టపోతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, తయారీ రంగం బలహీనపడుతోందని, బ్యాంకింగ్ వ్యవస్థను పెద్ద వ్యాపార వర్గాలు దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలో అవినీతికి తలుపులు బార్లా తెరిచారని ఆరోపిస్తూ, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రజల గొంతుకను వినిపించడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# బాలరాజ్ గౌడా మజాకా..!

ఘట్కేసర్ మండలం, అన్నోజిగూడలో మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్ అరాచకాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి . కేవలం 8 ఎకరాల భూమిని అడ్డుపెట్టుకుని 86 ఎకరాలకు పైగా భూముల్లో వివాదాలు సృష్టిస్తున్నాడనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. మ్యూటేషన్ జరగని భూములను లక్ష్యంగా చేసుకుని తక్కువ ధరలకు కొనుగోలు చేయడం, అనంతరం వాటినే బ్యాంకులకు తనఖా పెట్టి భారీ మొత్తంలో రుణాలు పొందడం, డబుల్ రిజిస్ట్రేషన్ల ద్వారా బ్యాంకులను సైతం తప్పుదోవ పట్టిస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి .ఇవే కాకుండా బాలరాజ్ గౌడ్ చేసిన అరాచకాలపై స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అన్నోజిగూడలోని 40 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి 15 ఫీట్ల విస్తీర్ణంతో సుమారు 2334 చదరపు గజాలు అడ్డదారిలో రిజిస్ట్రేషన్ చేసుకుని మున్సిపల్ వ్యవస్థకే సవాలు విసిరిన ఘనత అతనికే దక్కిందని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ మార్గంలో రోడ్డును రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆ రోడ్డును ఆక్రమించి ప్రజా రవాణా సౌకర్యాలకు ఆటంకం కలిగిస్తూ, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడనే ఆరోపణల నేపథ్యంలో బాధితులు హైడ్రాకి ఫిర్యాదు చేయగా



హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. త్వరలోనే ఈ వ్యవహారంపై చర్యలు ఉండొచ్చనే ప్రచారం సాగుతుండగా కబ్జాదారుల్లో గుబులు మొదలైందని స్థానికులు చెబుతున్నారు.మరోవైపు 30 మందికి పైగా బౌన్సర్లను వెంటబెట్టుకుని రైతులు, ప్లాట్ల యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. ప్రహరీ గోడల కూల్చివేతలు, కబ్జాలకు యత్నాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు వంటి ఘటనలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదులు అందినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని బాధితులు వాపోతున్నారు.తీగ లాగితే డొంక కదులుతున్న చందంగా మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్ వ్యవహారంలో ఒక్కొక్కటిగా బయటపడుతున్న అంశాలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. భూ వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, రహదారి ఆక్రమణలు, బౌన్సర్ల బెదిరింపులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు, బాధితులు పోలీస్ కమిషనర్, రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.


**మహా, స్టేట్ బ్యూరో చీఫ్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ మండలం అన్నోజిగూడలో మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్ అరాచకం రాజ్యమేలుతోంది. మ్యూటేషన్ జరగని వ్యవసాయ భూములే టార్గెట్‌గా, పొజిషన్ లేని ఆస్తులను బ్యాంకర్లకు చూపిస్తూ కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఘరానా మోసాల గుట్టు రట్టవుతోంది! ఒకవైపు పార్టిషన్ కాలేదనే వాదనలు వినిపిస్తుండగా, మరోవైపు అదే భూములను తనఖా పెట్టి రుణాలు పొందడం ఎలా సాధ్యమైందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమయంలో 30 మందికి పైగా బౌన్సర్లతో హల్‌చల్ చేస్తూ, ప్రహరీ గోడల కూల్చివేతలు, 40 అడుగుల రహదారి దురాక్రమణ పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. మహా పత్రిక కార్యాలయానికి చేరుకున్న బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. మొత్తం వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పోలీస్ యంత్రాంగాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన హైడ్రా బృందం..!**
అన్నోజిగూడ జీపీ లేఅవుట్‌లో 40 అడుగుల రహదారి ఆక్రమణ వ్యవహారంపై హైడ్రా స్పందించింది. మహా పత్రికలో వరుసగా వెలువడిన కథనాలు, బాధితులు సమర్పించిన పత్రాలు, ఫొటోలు, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు అందింది. దీనిపై వెంటనే స్పందించిన హైడ్రా అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.
హైడ్రా సీఐ రాజశేఖర్ నేతృత్వంలోని బృందం అన్నోజిగూడ జీపీ లేఅవుట్‌ను సందర్శించి, వివాదాస్పద 40 అడుగుల రహదారిని పరిశీలించింది. బాధితులు సమర్పించిన లేఅవుట్ పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇతర ఆధారాలను పరిశీలించిన అధికారులు పూర్తి వివరాలను సేకరించారు.
ఈ సందర్భంగా సంబంధిత పత్రాల చట్టబద్ధతపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, సదరు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల రద్దుకు ఘట్కేసర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సిఫార్సు చేస్తామని హైడ్రా అధికారులు బాధితులకు హామీ ఇచ్చారు. ప్రజా వినియోగ రహదారుల ఆక్రమణ విషయంలో రాజీ ఉండదని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హైడ్రా బృందం స్పష్టం చేసారు.దీంతో చాలా కాలంగా న్యాయం కోసం పోరాడుతున్న బాధితుల్లో ఆశలు చిగురించగా, రహదారి ఆక్రమణలపై త్వరలోనే కీలక చర్యలు ఉండొచ్చనే చర్చ స్థానికంగా కొనసాగుతోంది.

**సర్వే నంబర్ 79 మాయాజాలం..!**
అన్నోజిగూడ సర్వే నంబర్ 79కు సంబంధించిన భూమి వ్యవహారం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈ భూమికి అల్వాల రాజలింగం పట్టాదారుగా ఉన్నారు. కుటుంబ భాగపంపకాల ప్రకారం ఆయనకు సుమారు 17.10 ఎకరాల భూమి వాటాగా వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం 1980 సంవత్సరంలో అల్వాల రాజలింగం తన వాటాలోని 7.15 ఎకరాలను ధర్మవరం సీతారం అనే వ్యక్తికి, మరో 9.35 ఎకరాలను పాండు, అంబారెడ్డి అనే వ్యక్తులకు విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు.
తదనంతరం ధర్మవరం సీతారం తన వద్ద ఉన్న భూమిలో 6.30 ఎకరాలను మినీ సింగపూర్ వెంచర్‌కు, మరో 25 గుంటలను ఇతరులకు విక్రయించినట్లు సమాచారం. అలాగే పాండు, అంబారెడ్డి తమ వద్ద ఉన్న సుమారు 8 ఎకరాల భూమిని ప్రగతి కుమార్‌కు విక్రయించినట్లు తెలుస్తోంది. అయితే ప్రగతి కుమార్ పేరున మ్యూటేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నప్పటికీ భూమి మాత్రం ఆయన భౌతిక స్వాధీనంలోనే ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.
ఇదే సమయంలో అల్వాల రాజలింగం కుమారుడు అల్వాల నర్సింహ గౌడ్ పేరుతో తిరిగి రెవెన్యూ రికార్డుల్లో నమోదు జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. రికార్డుల్లో పేరు కొనసాగిన నేపథ్యంలో 1990లో పాస్‌బుక్ కూడా పొందినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకున్న బాలగోని బాలరాజ్ గౌడ్, భూమిపై వాస్తవ స్వాధీనం లేకపోయినా తక్కువ ధరకు హక్కులు పొందే ప్రయత్నం చేసి, అనంతరం తన ఇద్దరు భార్యల పేర్లపై సుమారు 9.35 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు రెవెన్యూ రికార్డులు తేటతెల్లం చేస్తున్నాయి.అంతేకాకుండా కేవలం కాగితాలపై వెంచర్‌ను సృష్టించి, అదే భూమిని ఆధారంగా చూపుతూ వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ.25 కోట్ల వరకు రుణాలు పొందినట్లు తెలుస్తుంది. అయితే భూమి భౌతిక స్వాధీనంలో లేకపోయినా బ్యాంకులు ఎలా రుణాలు మంజూరు చేశాయనేది ప్రశ్నర్థకంగా మారింది.ఇదిలా ఉండగా, ప్రగతి కుమార్ రంగారెడ్డి సివిల్ కోర్టును ఆశ్రయించి ఓ.ఎస్ నెం.422/1995 కేసులో అనుకూల తీర్పు పొంది, అనంతరం ఆయన తిరిగి పట్టాదార్ పాస్‌బుక్ కూడా పొందినట్లు రికార్డులు తేటతెల్లం చేస్తున్నాయి. ఒకవైపు కోర్టు తీర్పు, మరోవైపు భౌతిక స్వాధీనం, ఇంకోవైపు బ్యాంకు రుణాల వ్యవహారం మొత్తం కలిపి సర్వే నంబర్ 79 వ్యవహారాన్ని మరింత వివాదాస్పదంగా మార్చిందని స్థానికులు అంటున్నారు.భూమిపై వాస్తవ హక్కులు, రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, బ్యాంకు రుణాల అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భౌతిక స్వాధీనం లేని భూములను తనఖా పెట్టి రుణాలు పొందినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై, అలాగే తగిన పరిశీలన లేకుండా రుణాలు మంజూరు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**మినీ సింగపూర్ వెంచర్ ప్లాట్లపై దౌర్జన్యం..!***

సర్వే నంబర్ 76లో అభివృద్ధి చేసిన మినీ సింగపూర్ వెంచర్ ప్రస్తుతం వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. స్థానికుల కథనం ప్రకారం ఈ భూమికి మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్‌కు గానీ, అల్వాల కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు. అయినప్పటికీ ఈ వెంచర్‌లో చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు మున్సిపాలిటీ నుంచి నిర్మాణ అనుమతులు పొంది ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా, వాటిని అడ్డుకునేందుకు పలు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
బాధితుల ఆరోపణల ప్రకారం బాలగోని బాలరాజ్ గౌడ్ తన అనుచరులు, ప్రైవేట్ బౌన్సర్లతో కలిసి రాత్రివేళల్లో వెంచర్‌లోకి ప్రవేశించి ఇప్పటికే నిర్మించిన ప్రహరీ గోడలను కూల్చివేయడం, నిర్మాణ సామగ్రిని ధ్వంసం చేయడం, ప్లాట్ల యజమానులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. చట్టబద్ధ అనుమతులతో నిర్మాణాలు చేపడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని ఈ తరహా దౌర్జన్యాలకు దిగడం ఆయన రౌడీయిజానికి పరాకాష్టగా నిలుస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.





40 ఫీట్ల రోడ్డు ను పరిశీలిస్తున్న హైడ్రా సీ ఐ . రాజశేఖర్

**సీపీ మేడమ్... ఒక్కసారి అన్నోజిగూడ వైపు చూడరా..!**
అన్నోజిగూడలో నెలకొన్న పరిస్థితులు స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్ అనుచరులు, ప్రైవేట్ బౌన్సర్ల సంచారంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళా రైతు కూలీలు, వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే వారు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పొలాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటుండటంతో తమ భద్రతపై ఆందోళన పెరుగుతోందని చెబుతున్నారు.ఇప్పటికైనా పోలీస్ కమిషనర్ ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని గ్రామంలో మోహరించిన బౌన్సర్లను వెంటనే అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రౌడీషీటర్‌గా ఉన్న బాలగోని బాలరాజ్ గౌడ్ కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని, మళ్లీ ఆయనపై రౌడీషీట్ తెరిచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్రామంలో శాంతిభద్రతలు కాపాడటంతో పాటు రైతులు, ప్లాట్ల యజమానులు, మహిళా కూలీలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించాలని స్థానికులు, బాధితులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. చట్టం పట్ల ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే అన్నోజిగూడ వ్యవహారంలో పోలీస్ కమిషనర్ తో పాటు, స్థానిక పోలీసులు తక్షణం జోక్యం చేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు



## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

- **భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం.**
- **ఆగస్టు 1న కార్యక్రమానికి హాజరుకానున్న ప్రధాని.**
- **ఏర్పాట్ల కోసం నలుగురు ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు**

**ఢిల్లీ, మహా :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధాని మోదీని ఆహ్వానించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కీలక మౌలిక సదుపాయంగా మారుతుందని, ప్రారంభోత్సవానికి హాజరై రాష్ట్ర ప్రజలను ఆశీర్వదించాలని వారు ప్రధానిని కోరినట్లు తెలిసింది. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమహేంద్రవరం కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్ ప్రజా సౌకర్యాలు, పారిశుద్ధ్యం, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. వీరికి సహకరించేందుకు మరో 26 మంది నాన్‌క్యాడర్ అధికారులను నియమించగా, వారు విజయనగరం జిల్లా కలెక్టర్ సమన్వయంతో విధులు నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లాలో నిర్మితమవుతున్న 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో హైదరాబాద్ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందిన తరహాలోనే భోగాపురం ప్రాంతం కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా పెట్టుబడులు పెరగడంతో పాటు వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చారిత్రాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## సీజేపీతో చర్చలకు కేంద్రం సై.

- **సీజేపీతో చర్చకు సిద్ధమన్న కేంద్రం.**
- **చర్చకు మేము రెడీ.. తేల్చుకుందాం రండి**
- **విద్యాశాఖ మంత్రి రాజీనామాకే విపక్షాల పట్టు.**

**ఢిల్లీ, మహా. :** దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్న 'నీట్' పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక ప్రకటన చేసింది. ప్రతిపక్ష కాక్రోచ్ జనతా పార్టీ , కాంగ్రెస్ పార్టీలు ఈ అంశంపై తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ప్రతిపక్షాలు ఎప్పుడు కోరితే అప్పుడు, ఏ నిబంధన కిందైనా సభలో చర్చలు జరపడానికి ప్రభుత్వం వంద శాతం సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంపై దేశ ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు తాము వెనకాడేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. *ప్రతిపక్షాలు సాకులు వెతుకుతున్నాయి..*వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచే నీట్ పేపర్ లీక్‌పై చర్చకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఉభయ సభల్లో ప్రకటించారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలను సభ వేదికగా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రతిపక్షాలు కావాలనే కొత్త షరతులు విధిస్తూ, సభలో చర్చ జరగకుండా తప్పించుకోవడానికి సాకులు వెతుకుతున్నాయని రిజిజు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రభుత్వం తరపున చర్చకు అంగీకరించిన వెంటనే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్పీకర్ సైతం అజెండాను ఖరారు చేయడానికి ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆహ్వానించారు.

**సీజేపీ ఆందోళనలు..**
**ప్రధాని మోదీ సీరియస్ యాక్షన్**

మరోవైపు నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) చేపట్టిన నిరసనలతో దేశ రాజధాని అట్టుడికిపోతోంది. సీజేపీ నిర్వహించిన నిరసన ర్యాలీ ఏకంగా పార్లమెంట్ భవనం వద్దకు దూసుకురావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో నిరసనకారులను పోలీసులు బారికేడ్లతో అడ్డుకుని లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. ఈ అసాధారణ పరిణామాల మధ్య ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయే ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. పేపర్ లీక్‌కు పాల్పడిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇప్పటికే ఈ కేసులో 13 మందిని అరెస్ట్ చేశామని ప్రధాని తన ఎంపీలకు వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు ఏమాత్రం దెబ్బ తినకుండా ఉండేందుకే నీట్ రీఎగ్జామ్‌కు ప్రాధాన్యత ఇచ్చి విజయవంతంగా నిర్వహించామని ఆయన స్పష్టం చేశారు.

**మండిపడుతున్న ప్రతిపక్షాలు..**
**మంత్రి రాజీనామాకు పట్టు**

కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇండియా కూటమి పక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సభలో నిష్పక్షపాతంగా చర్చ జరగాలంటే ముందుగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే గట్టిగా డిమాండ్ చేశారు. ఆయన రాజీనామా చేసేంత వరకు సభలో ఎలాంటి చర్చకు అంగీకరించేది లేదని ఖర్గే తేల్చి చెప్పారు. దీనికి తోడు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తదితర అగ్ర నేతలు పార్లమెంట్ ఆవరణలో నల్ల దుస్తులు ధరించి కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. విద్యార్థుల సమస్య రాజకీయ పార్టీల ప్రయోజనాల కంటే చాలా పెద్దదని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఉద్ఘాటించారు. ఇది కేవలం మంత్రి రాజీనామాకు మాత్రమే పరిమితమైన అంశం కాదని, విద్యార్థులు రోడ్లెక్కి పోరాడుతున్నందున దీనిపై ప్రధాని మోదీ స్వయంగా సభలో ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆదర్శ గ్రామపంచాయతీగా నిలిచేలా నందుల పల్లి ఎంపిక

**... బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు**

బెల్లంపల్లి, మహా:బెల్లంపల్లి నియోజకవర్గం నుండి నన్నెల మండలంలోని నందులపల్లి గ్రామంను ఆదర్శ గ్రామపంచాయతీగా మలిచేందుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సమగ్ర అభివృద్ధి, స్వచ్ఛ సర్వేక్షణ్-2026 పై గ్రామ సభను నిర్వహించారు.

బెల్లంపల్లి నియోజకవర్గం నుండి ఒక్క గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి, మూడు సంవత్సరాల్లో 100 శాతం అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నెన్నెల మండలంలోని నందులపల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు.నందులపల్లి గ్రామసర్పంచ్ కామెర వనిత ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో తాగునీరు,,రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, విద్యుత్, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు తదితర సమస్యలపై సమగ్రంగా చర్చించి, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులపై నివేదికను సిద్ధం చేశారు. ప్రజల సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని మూడు సంవత్సరాల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.స్వచ్ఛ సర్వేక్షణ్-2026 కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రతి ఇంటి పరిసరాలను శుభ్రంగా నిర్వహించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించాలని గ్రామ ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, మంచిర్యాల జిల్లా డిసిసి వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన హరీష్ గౌడ్ , నాయకులు గురునాథం మల్లా గౌడ్ తో పాటు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మోదీతో భేటీకి జగన్ ప్రయత్నాలు



- **అపాయింట్మెంట్ కోరినట్లు ప్రచారం**
- **ఏపీ పాలిటిక్స్ లో చర్చ**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలతో భేటీ కావడానికి అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే వారం ఈ భేటీ జరిగే అవకాశముందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం జగన్ ఇప్పటివరకు ఢిల్లీ పర్యటనకు దూరంగా ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై విమర్శలు, జిల్లాల పర్యటనలు, బాధితుల పరామర్శలు, పార్టీ బలోపేతంపైనే దృష్టి సారించారు. అయితే ఇప్పుడు కేంద్ర నాయకత్వాన్ని కలవడానికి ప్రయత్నించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, శాంతిభద్రతల పరిస్థితి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులుగా పార్టీ పేర్కొంటున్న అంశాలను ప్రధాని, కేంద్ర హోం మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని జగన్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తమ వద్ద ఉన్న ఆరోపణలు, ఫిర్యాదులను కూడా కేంద్ర పెద్దలతో పంచుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న కీలక బిల్లుల విషయంలో వైఎస్సార్సీపీ సానుకూల వైఖరిని అవలంబిస్తోంది. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ వంటి కీలక అంశాల్లో కేంద్రానికి మద్దతు ఇవ్వాలని పార్టీ ఇప్పటికే నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్లమెంట్‌లో పార్టీ ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహంపై జగన్ దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

పార్టీ పార్లమెంటరీ నేత వైవీ సుబ్బారెడ్డి ఇప్పటికే ప్రధాని కార్యాలయం, కేంద్ర హోంమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి అపాయింట్‌మెంట్ కోరినట్లు ప్రచారం జరుగుతోంది. అపాయింట్‌మెంట్ ఖరారైన వెంటనే జగన్ ఢిల్లీకి వెళ్లనున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.అయితే ఈ ప్రతిపాదిత భేటీపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపైనే కేంద్ర నాయకత్వంతో చర్చించేందుకే జగన్ ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్సీపీ నేతలు చెబుతుండగా, వివిధ దర్యాప్తు సంస్థల విచారణలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే ఈ భేటీకి ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై వైఎస్సార్సీపీ నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల నుంచి అపాయింట్‌మెంట్ ఖరారవుతుందా, భేటీ జరిగితే ఎలాంటి అంశాలు చర్చకు వస్తాయనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ సమావేశం జరిగితే రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పరిణామాలకు దారితీసే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## గత పాలనలో ప్రజల గోడు వినేవారే లేరు

- ప్రతివారం గాంధీభవన్‌లో ప్రజలతో మంత్రుల ముఖాముఖి
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి
- 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం
- ప్రధాని మోదీ, విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా** : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలకులకు ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి అవకాశం ఉండేదికాదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రుల కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవారుకాదన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రతివారం క్యాబినెట్‌లో ఒక మంత్రి ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తు వీలైనంతవరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నేటి ముఖాముఖిలో చాలా వరకు ఇండ్ల గురించి దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఈ ప్రభుత్వంలోనే తమ సొంతింటి కల నెరవేతుందనే ఆశతో ప్రజలు ఉన్నారని, వారి ఆశలకు అనుగుణంగా తమ ప్రభుత్వం మొదటి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలు మొత్తం 7 లక్షల ఇండ్లను మంజూరు చేసిందన్నారు. గడచిన పదేళ్ళలో ఆనాటి ప్రభుత్వం పేదలకు అరకొరగా నగరానికి 3040 కిలోమీటర్ల దూరంలో ఇండ్లు నిర్మించిందని, ఫలితంగా తమ జీవనోపాధి దెబ్బతింటుందన్న ఆందోళనతో పేదలు ఆ ఇళ్లల్లో అడుగు కూడా పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పేదవాడు పుట్టి పెరిగిన చోటే నివాసం కల్పించాలన్న సంకల్పంతో నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నిర్మించబోయే ఇండ్ల విలువ 40 నుంచి కోటి రూపాయిల వరకు ఉంటుందని ఇంటిస్థలంలో వాటా కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈ ఇండ్ల కోసం మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా మరో సారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కరించగలిగిన అన్నింటికీ పరిష్కారం చూపిస్తామన్నారు.

శంలో యువతను దెబ్బతీసిన నీట్ పరీక్ష లీకేజీపై శాంతియుతంగా ఢిల్లీలో ధర్నా చేస్తున్న యువతపైన, మద్దతు తెలిపిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీలపై లాఠీఛార్జి చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేక పార్లమెంటును పలుమార్లు వాయిదా వేయడం, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ చేతకానితనాన్ని ఎత్తిచూపుతుందన్నారు. తక్షణమే ప్రధాని మోదీ, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసిసి పిలుపు మేరకు ఈరోజు హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించామని, నీట్ పరీక్ష రాసిన 22 లక్షల మంది అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు

## తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్

- **అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ.**
- **35 లక్షల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిన లక్ష్యం..**
- **రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కిషన్‌రెడ్డి సూచన.**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రైతులకు ఊరటనిచ్చే కీలక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రం నుంచి సేకరించే బియ్యం పరిమాణాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, అంటే సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణకు మార్గం సుగమమైంది. ఈ నిర్ణయంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి కృతజ్ఞతలు తెలిపారు.

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025-26 ప్రారంభానికి ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారుల సమక్షంలో తెలంగాణ నుంచి 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఈ నెల 8న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి సేకరణ లక్ష్యాన్ని పెంచాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు బియ్యం సేకరణను 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచిందన్నారు.తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పండిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం తనవంతు సహకారం అందిస్తోందని చెప్పారు.అదనంగా మంజూరైన బియ్యం సేకరణ లక్ష్యాన్ని తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేసి, కేంద్రానికి ఇచ్చిన కమిట్‌మెంట్ మేరకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు నిర్ణీత గడువులో బియ్యాన్ని అందజేయాలని కోరారు. గత మార్కెటింగ్ సీజన్లలో రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన బియ్యాన్ని గడువులోగా అందించలేక పలుమార్లు గడువు పొడిగింపు కోరిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈసారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా సమర్థవంతమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.గతంలో కేటాయించిన బియ్యం కోటాతో పాటు తాజాగా పెంచిన అదనపు కోటాను కూడా సకాలంలో ఎఫ్‌సీఐకి అప్పగించడం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం తెలంగాణ రైతులకు మేలు చేసే మరో కీలక అడుగుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## సింగరేణి మనుగడకు ఐక్య పోరాటం

**బెల్లంపల్లి, మహా**: సింగరేణి సంస్థ మనుగడ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అన్ని ట్రేడ్ యూనియన్లు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శాంతిఖని మైన్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో కార్మిక వ్యతిరేక విధానాలు నిలిపివేసి, మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన మెడికల్ బోర్డు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడంతో పలువురు కార్మికులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ పొందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం, యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సింగరేణికి కొత్త బొగ్గు గనులను కేటాయించి సంస్థ భవిష్యత్తును బలోపేతం చేయాలని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి సంస్థ అభివృద్ధికి అన్ని వర్గాలు కలిసి పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.






## మిరాకిల్ మైండ్స్ పాఠశాలలో జాతీయ జెండా దినోత్సవం

**సత్తుపల్లి, జూలై 22: మహా.**
స్థానిక పట్టణ పరిధిలోని మిరాకిల్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ జెండా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. అనంతరం దేశ జెండా గొప్పతనం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, జాతీయ ఐక్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రత్నాకర్ మాట్లాడుతూ జాతీయ పతాకం మన గౌరవానికి, దేశ సమైక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. జాతీయ జెండాలోని త్రివర్ణ రంగుల ప్రాముఖ్యత, అశోక చక్రం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రతి పౌరుడు జాతీయ జెండాను గౌరవించడం తన బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఫాం ఫాండ్స్ నిర్మాణానికి రైతులు ముందుకు రావాలి అడిషనల్ కలెక్టర్ శ్రీజ

**కారేపల్లి, మహా :** ఉపాధి హామీ ద్వారా ఉచితంగా నిర్మాణం చేస్తున్న ఫాం ఫాండ్(నీటి కుంటలు) ఏర్పాటు చేసుకోవటానికి రైతులు ముందుకు రావాలని అడిషనల్ కలెక్టర్ శ్రీజ కోరారు. బుధవారం సింగరేణి మండలం కారేపల్లిలోని షేక్ యాకూబ్ ఫాషా, సూరపురెడ్డి సీతారామిరెడ్డి, గాలి వెంకటరంగారావు భూములను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఫాం ఫాండ్స్ నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు పెరగటంతో పాటు సమీపంలోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతుందన్నారు. భూమి 5 ఎకరాలు లోపు ఉండి ఇజీఎస్ కార్డు ఉన్న రైతులకు రూ.2లక్షలతో నీటి కుంటలు 12 x 15 కొలతలతో నిర్మాణం పూర్తిగా ఉచితంగా నిర్మించటం జరుగుతుందని తెలిపారు. వర్షాభావ పరిస్థితిలలో రైతులు ఆరుతండి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో పద్మ, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఏఈ నాగేంద్రబాబు, ఏవో బట్టు అశోక్ కుమార్, ఆర్ఐ జగదీష్, ఏఈవో మున్ని తదితరులు ఉన్నారు.

## భూ సర్వే వేగవంతం చేయాలి

**జూలూరుపాడు, మహా:** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూ సర్వే పనులను ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జూలూరుపాడు, కొత్తూరు గ్రామాల్లో భూ సర్వే పురోగతిని పరిశీలించిన ఆయన, రెవెన్యూ-ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పడమట నర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## కే.కే.ఓ.సి.పి. భూసేకరణ ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్

**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా కే.కే.ఓ.సి.పి. భూసేకరణ ప్రాంతాన్ని బుధవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ ఐ.ఈ. ఎస్.ఎస్. డి మనోజ్, స్థానిక జీయం ఎన్ రాధాకృష్ణ లు పరిశీలించారు. ఓపెన్ క్యాస్ట్ ప్రాజెక్ట్ ముంపుకు గురవుతున్న పెద్దనపల్లి గ్రామంలో నాన్ ఫారెస్ట్ ల్యాండ్ కు చెందిన భూములను, ముంపుకు గురవుతున్న రైతుల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన పటాలను, సరిహద్దులను అధికారులతో కలిసి వారు సమగ్రంగా తనిఖీ చేశారు. ప్రాజెక్టు పురోగతి, భూసేకరణ ప్రక్రియ వేగవంతంతో పాటు స్థానిక రైతులు, నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కేకే ఓ సి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సింగరేణి అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ANN తెలుగు

**మహా పత్రిక**

గురువారం, హైదరాబాద్

23-07-2026

(మహా ప్రత్యేకం)




# దేశవ్యాప్తంగా నిరసనల హోరు

మహా , ఇంటర్నెట్ డెస్క్: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతోంది. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు చేపట్టిన నిరసనలు ఢిల్లీ నుంచి రాష్ట్రాల వరకు ఉధృతమయ్యాయి. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టు, విద్యార్థుల ఆందోళనలపై పోలీసుల చర్యలను ఖండిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న ఆందోళనలు, ర్యాలీలు, ఉద్రిక్త పరిస్థితులను ప్రతిబింబించే చిత్రాలివి.

















# రాహుల్ అరెస్టుపై కాంగ్రెస్ ఆగ్రహం

- ప్రధాని మోదీ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు
- కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా కారేపల్లి క్రాస్ రోడ్ లో రాస్తారోక

**కారేపల్లి, మహా**: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మోధీ నాయకత్వంలో నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్, సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కారేపల్లి క్రాస్ రోడ్ లో బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజా స్వామికమని ఖండించారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వేలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ తీరు సరికాదని ఆరోపించారు. పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై మోడీ ప్రభుత్వం లాఠీ చార్జి చేపించడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సంఘీభావంగా ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసు బలగాలతో దౌర్జన్యంగా అరెస్టు చేయించిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసనకారులను ఇబ్బంది పెట్టే చర్యలు సరికావని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుంటే వాటిని పట్టించుకోకుండా ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం సరికాదన్నారు. ఈ రాస్తారోకో లో కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, పెద్దబోయిన ఉమాశంకర్, సూరపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, మేదరి టోనీ, ఎండి అనీఫ్,ఆదర్ల రాములు, ఈసాల ఛాయాదేవి, భీముడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ




**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: గిరిజన యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గిరిజన యువతను స్వయం ఉపాధి వైపు నడిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట గిరిజన భవన్‌లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) భద్రాచలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన శిక్షణ కేంద్రాన్ని బుధవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి వారికి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. నేటి కాలంలో కేవలం విద్య ఒక్కటే సరిపోదని విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం గిరిజన యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని దీని ద్వారా వందలాది మంది యువతీ యువకులు తమ జీవితాలను తీర్చిదిద్దుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఈ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ కుట్టు మిషన్ శిక్షణ బ్యూటీషియన్ కోర్సులు చేతివృత్తులపై ప్రత్యేక శిక్షణ టెక్నికల్ స్కిల్స్ ఉపాధి ఆధారిత వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు ఆయా రంగాల్లో ఉద్యోగాలు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గిరిజన యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన శిక్షణ పొందే అవకాశం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి కోసం ఎదురు చూడకుండా నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. యువజన శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకుడికి శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి, నిపుణుల ద్వారా బోధన వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం యువత ఉద్యోగ అవకాశాలను పొందేలా ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానం చేసే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. స్వయం ఉపాధి చేపట్టాలనుకునే వారికి అవసరమైన మార్గదర్శకత్వం, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కూడా కల్పిస్తామని వివరించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా గిరిజన యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందడమే కాకుండా వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువతులు ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడేందుకు కుట్టు మిషన్, బ్యూటీషియన్ వంటి కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కంప్యూటర్ టెక్నికల్ స్కిల్స్ ద్వారా ఆధునిక ఉద్యోగ రంగంలో పోటీపడే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు స్థానిక యువతకు నైపుణ్యాల ఆధారిత ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కేంద్రాలను మరింత విస్తరించే దిశగా చర్యలు చేపడుతోందని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, జిల్లా సెక్రెటరీ కోలా లక్ష్మీనారాయణ, మున్సిపల్ అధికారులు, ఐటీడీఏ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, శిక్షణా సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సర్వసభ్య సమావేశం

- విపక్ష సభ్యులు వాకౌట్
- అన్ని అంశాల ఆమెదం

**ఆదిలాబాద్ మహా** : అదిలాబాద్ పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మొత్తం ఐదు అంశాలలో రెండు అంశాలు ఆమోదం పొందగా, మిగిలిన మూడు అంశాలు కేవలం సమాచార నిమిత్తం మాత్రమే కౌన్సిల్ ముందుంచారు.యూసీఎఫ్ కింద రూ.68 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల 25 శాతం చొప్పున కాగా మిగిలిన 50 శాతం రుణం ద్వారా సమకూర్చే విధంగా ప్రతిపాదనను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు.రెండవ అంశంగా పట్టణంలో ప్రజల భద్రత దృష్ట్యాజిల్లా ఎస్పీ సూచనలతో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం.25 లక్షల నిధులు కేటాయించే అంశాన్ని కౌన్సిల్ ఆమోదించింది. ఇక మూడవ అంశంగా గతంలో జిల్లా కలెక్టర్‌అనుమతితో ఆమోదం పొందిన ఎనిమిది అంశాలను కౌన్సిల్‌కు సమాచార నిమిత్తం మాత్రం తెలిపారు. న్యూస్‌పేపర్ టెండర్లకు సంబంధించిన బిల్లులు, చివరిది మున్సిపాలిటీలో అప్పగించిన పనులను పూర్తి చేయని నలుగురు కాంట్రాక్టర్లను రెండేళ్ల పాటు మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి టెండర్లు పనుల్లో పాల్గొనకుండా నిషేధించే నిర్ణయాన్ని కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో కొందరు సభ్యులు కొన్ని అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, మెజారిటీ సభ్యుల మద్దతుతో కౌన్సిల్ నిర్ణయాలు ఆమోదం పొందినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రోహిత్, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ , టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ , ఎంఐఎం పార్టీలకు చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# వర్షా భావంలో వరికి బ్రేక్.. ప్రత్యామ్నాయ పంటలే మేలు..

- అనంతారంలో రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన..
- నాటు వేస్తున్న రైతును నిలిపివేసిన ఏఈఓ

**మణుగూరు, మహా** : ఎల్‌నినో ప్రభావంతో నెల కొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి సాగుకు దూరంగా ఉండి ఆరుతడి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మణుగూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణరావు సూచించారు. బుధవారం మండలంలోని అనంతారం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షపాతం తీవ్రంగా తగ్గిపోవడంతో పాటు భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బోర్లు, బావులపై ఆధారపడి వరి సాగు చేయడం రైతులకు నష్టాలను మిగులుస్తుందని హెచ్చరించారు. వరికి బదులుగా పామాయిల్, పెసర, కంది, మినుములు, వేరుశనగ, నువ్వులు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. వర్షాభావం కారణంగా విద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గిపోయిందని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా పరిమితంగా ఉండటంతో వరి సాగు మరింత ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉందన్నారు. గ్రామాల వారీగా ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓ రైతు వరి నాట్లు వేస్తుండగా వ్యవసాయ విస్తరణ అధికారి అక్కడికి వెళ్లి పరిస్థితులను వివరించి, మిగిలిన భూమిలో వరి నాట్లు వేయకుండా నిలిపివేసారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు కొంగర ఉపేందర్ రావు, నారాయణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



# మెడికల్ బోర్డును మళ్లీ నిర్వహించాలి..

- సింగరేణి యాజమాన్యానికి ఏఐటీయూసీ వినతి..
- కార్మికులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్

**మణుగూరు, మహా** : సింగరేణి కాలరీస్‌లో ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వెంటనే మరోసారి మెడికల్ బోర్డును నిర్వహించి అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు బుధవారం మణుగూరులోని అన్ని గనులు, విభాగాల వద్ద ఉన్నతాధికారులకు యూనియన్ నాయకులు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్ మాట్లాడుతూ, జూలై 18న నిర్వహించిన మెడికల్ బోర్డుకు 120 మంది కార్మికులను పిలిచినా, వారిలో కేవలం 24 మందిని మాత్రమే మెడికల్ ఇన్వాలిడ్‌గా ప్రకటించడం గతంలో జరిగిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని విమర్శించారు. అంతే కాకుండా 28 మంది కార్మికులకు తమను మెడికల్ బోర్డుకు పిలిచారనే సమాచారం కూడా అందకపోవడం విచారకరమన్నారు. బొగ్గు గనుల్లో దశాబ్దాలుగా అత్యంత ప్రమాదకరమైన, శారీరక శ్రమతో కూడిన పనులు చేస్తున్న కార్మికులు కాళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, బొగ్గు దుమ్ము కారణంగా శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు సహా అనేక దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. అయితే మెడికల్ బోర్డు కేవలం బయటకు కనిపించే ఆరోగ్య సమస్యలకే ప్రాధాన్యం ఇచ్చి, గనుల్లో పనిచేసే సామర్థ్యాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన అనారోగ్యాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2 వేల మందికి పైగా కార్మికులు మెడికల్ ఇన్వాలిడ్ కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వారి సమస్యల తీవ్రతను యాజమాన్యం గుర్తించి, గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరినీ మరోసారి మెడికల్ బోర్డుకు పిలిపించి, సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అర్హులైన అనారోగ్య కార్మికులను మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించి న్యాయం చేయాలని ఏఐటీయూసీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ జి. పుల్లారావు, జీఎం కమిటీ సభ్యుడు ఆవుల నాగరాజు, ఫిట్స్ కార్యదర్శులు శనగరపు కుమారస్వామి, జి. శ్రీనివాసరావు, ఈసం శ్రీనివాసరావు, బి. రవికుమార్, ఎం. పద్మావతి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు సుదీప్, డి.వి. రావు, అబ్రహం, జానకీ ప్రసాద్, దండు విజయ్, ఉడుత శివ, కందిమల్ల శ్రీనివాసరావు, శేఖర్ బాబు, నాగుల సతీష్, హుస్సేన్ రవిశంకర్, మంత్రి శ్రీనివాస్, వినోద్, కొట్టే రమేష్, రాజేందర్, గాంధీ చౌహన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

- పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణుల నిరసన
- ఎంపీ నగేష్ క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయింపు
- అడ్డుకున్న పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలింపు
- కేంద్రం తీరుపై భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు

**ఆదిలాబాద్ మహా** : విద్యార్థులు యువత పై పోలీసుల లాఠీ చార్జికి నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ బుధవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామ చేయాలంటూ శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జీ చేయడాన్ని ఖండించారు. ఢిల్లీలో విద్యార్థుల పోరాటానికి సంఘీభావంగా నిలిచి నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తున్నామని అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు బ్రిటిష్ పాలనను తలపిస్తోందని విమర్శించారు. అనంతరం అక్కడినుండి ఎంపీ నగేష్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ముందు నిరసన తెలిపారు. నీట్ లీకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్కడే బైఠాయించి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పోలీసులు నిరసన తెలుపుతున్న పలువురు కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్ రావు,రాజు యాదవ్ ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా, నాయకులు అల్లూరి సంజీవరెడ్డి , లీగల్ సెల్ అధ్యక్షులు మంగేష్ దేవతడే ,పరమేశ్వర్ ,డేర కృష్ణారెడ్డి,బెజ్జంకి అనిల్ కుమార్ , మాధవ్ పటేల్ గారు, గౌలి సంజీవ్ కుమార్, దేవిదాస్ చారి ,అక్తర్ అలీ ,లక్ష్మారెడ్డి , హిమాభిషేక్ రెడ్డి ,కౌన్సిలర్ అన్నపూర్ణ , ఇమ్రాన్ రమేష్ యాదవ్ , మందాకిని తొడసం దౌలత్ రావు గారు, వెంకట యాదవ్ , అరవింద్, అశోక్, దేవిదాస్, అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# పల్లెప్రకృతి వనంలో వి.ఓ.కార్యాలయమా.....?

**దమ్మపేట, మహా** : పల్లెల్లో ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తే ప్రజలు స్వచ్ఛమైన వాతావరణంలో స్వేచ్ఛా గాలులు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యం తో ఆనాడు టిఆర్ఎస్ పాలకులు ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలకు ఆధరణ కరువైంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జాడలు ఎక్కడా ఉండకూడదనే ఉద్దేశంతో దమ్మపేట మండలం గండుగులపల్లిలోని పల్లె ప్రకృతివనంలో నిర్మిస్తున్న వి.ఓ.కార్యాలయ నిర్మాణాన్ని బిఆర్ఎస్ మాజీ యూత్ అధ్యక్షులు మండవ సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడుతుందని, ఆప్యాయంగా ఉండటానికి అనాడు పల్లె ప్రకృతివనాలు కేసీఆర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ అభివృద్ధి కార్యక్రమాలు కనిపించకుండా ఉండటానికి నేడు గ్రామంలో ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, మంత్రి ఉద్దేశపూర్వకంగా పీడీ కార్యాలయం నిర్మాణం చేయిస్తున్నట్లు ఆరోపించారు. పీడీ కార్యాలయం ఊరు మధ్యలో నిర్మాణం చేస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రజల కోరిక మేరకు తక్షణమే పల్లె ప్రకృతివనంలో పీడీ భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని బిఆర్ఎస్ నాయకులు మండవ సత్యనారాయణ హెచ్చరించారు.



# బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**అండగా ఉంటానని భరోసా**

**కారేపల్లి, మహా**: కారేపల్లి మండలం పాటిమీదిగుంపు, చీమలపాడు గ్రామాలలో వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ బుధవారం పర్యటించి మృతులకుటుంబాలు, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులనుపరామర్శించారు. పాటిమీదిగుంపులో సొసైటీ డైరక్టర్ ఆర్ఎంపీ పోతురాజు రమేష్ తండ్రి పోతురాజు కృష్ణయ్య సంస్మరణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హాజరై కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మృతునికి కుమారుడు పోతురాజు రమేష్ కు సానుభూతిని తెలిపారు. బాజుమల్లాయిగూడెంలో ఇటివల మృతి చెందిన బస్వరాజు రాంబాబు కుటుంబాన్ని పరామర్శించారు. చీమలపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న పాటి కోటయ్య ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తమ తోడ్పాడు ఎప్పటి ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, గ్రామీణ వైద్యల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు పిట్టల నాగేశ్వరరావు, అనంతారపు వెంకటాచారి, సర్పంచ్ ఉదారావత్ మంగీలాల్, మాజీ ఎంపీటీసీ ధర్మసోత్ శంకర్, మాజీ సర్పంచ్ లు మాలోత్ కిషోర్, బానోత్ శంకర్, మాలోత్ రాంజీ, బీఆర్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, ఏఎంసీ మాజీ డైరక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు పాటి శ్రీనివాసరావు, అజ్మీర బిక్కులాల్, బానోత్ ప్రసాద్, వీరబాబు, శీలంశెట్టి రాంబాబు, గుగులోత్ హోరు, భూక్య రాంకిషోర్ తదితరులు పాల్గొన్నారు.




# రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు అందించిన ఎస్పీ

**ఆదిలాబాద్ మహా**: ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నా చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్ డాట్ జీవోవీ డాన్ ఇన్ అనే వెబ్సైట్ లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఇలా జిల్లాలో పోగొట్టుకున్నమొత్తం 105 మొబైల్ ఫోన్లను బుధవారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ వాటి యజమానులకు అందించారు. వీటి విలువ దాదాపు 12.5 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసారు. పోగొట్టుకున్న దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్ల రికవరీకి ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరిగే ప్రాంతాలు రైతు బజార్, రిమ్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇళ్లలో దొంగతనాలు, బంధువులకు ఫోన్ చేస్తానంటూ ఫోన్ తస్కరించడం లాంటివి జరుగుతున్నాయని, వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మొబైల్ ఫోన్లు రికవరీ చేసి అందించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెలలో ఒక రోజు తిరిగి రాబట్టిన ఫోన్లను అందచేస్తామని తెలిపారు. మొబైల్ దొంగతనాలు జరిగే క్రమంలో వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ దుకాణాలు , రిపేరింగ్ దుకాణాల యజమానులు, మొబైల్ ఫోను కొనే ముందు యజమాని అనుమతితో సరైన పత్రాలు తీసుకోవాలన్నారు. చోరీచేసిన మొబైల్ ఫోన్లు కొంటే చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అటు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి చేతికి అందగానే బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక ఐపీఎస్, అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, మజీద్, అన్వేష్, నవనీత్, జుబేర్ మరియు ఇజాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షులు ఇనగాల ఆధ్వర్యంలో
# ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

- పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువత భవిష్యత్తును అంధకారం చేస్తోంది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హనుమకొండ, మహా;** ఢిల్లీలో మంగళవారం నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని హనుమకొండ డిసిసి అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు బుధవారం హనుమకొండ డీసీసీ భవన్ వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన 'నీట్' పేపర్ లీకేజీ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఈ భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. డీసీసీ భవన్ వద్ద దిష్టిబొమ్మ దహనం అనంతరం, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ పాల్గొని కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీరితో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్. నాగరాజు, టిపిసిసి మెంబర్లు కుచన రవలి, ఇ.వి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ గుండు సుధారాణి, ఏనుమముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్, మండల అధ్యక్షులు, హనుమకొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు. భట్టి విక్రమార్క గారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో సామాన్యుల తరపున, విద్యార్థుల తరపున ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ భయపడదని, ప్రజల తరఫున పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న 'నీట్' పరీక్ష పేపర్ లీకేజీ కావడం ఈ కేంద్ర ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ పేపర్లు అమ్ముకుంటున్న విద్యా మాఫియాకు ఈ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శించారు. విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిలకడ లేని, అవినీతిమయమైన నేషనల్... టెస్టింగ్ ఏజెన్సీ ని కేంద్రం తక్షణమే రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని, నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

# కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అరెస్టుపై భగ్గుమన్న నాయకులు

- నల్ల బ్యాడ్జీలతో నిరసన.
- కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
- జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్

**క్యాతనపల్లి, మహా :** కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడంతో రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భగ్గుమన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై ప్రధానమంత్రి మోడీ నివాసం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రయాంక గాంధీ, పార్టీ ఎంపీలను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నాయకులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందన్నారు. పార్లమెంట్ లో నీట్ పేపర్ లీకేజ్ పై ప్రతిపక్ష ఎంపీలు చర్చలు జరపాలని కోరితే ఎంపీలను అడ్డుకొని అదుపులోకి తీసుకోవడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ హయాంలో కష్టపడి చదివే విద్యార్థులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమన్నారు. పేపర్ లీకేజ్ కి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు విద్యార్థుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కూతురు ప్రభాకర్ , భీమా మల్లేష్, గుర్రం శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, మాజీ జెడ్పిటిసి యాకూబ్ అలి, నాయకులు పనాస రాజు, సాగర్ రెడ్డి, సుధాకర్, పుల్లూరి కళ్యాణ్, శ్రీనివాస్, గోపు రాజం, సురేందర్, రాజేష్, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.



# ఆలేరు రెవెన్యూ డివిజన్ కాలయాపనకు నిరసనగా 31 బంద్

**ఆలేరు జులై 22 మహా :** ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కాలయాపన నిరసనగా ఈనెల 31వ తేదీ ఆలేరు పట్టణ బంద్ తోపాటు స్థానిక బస్టాండ్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించాలని ఆలేరు రెవెన్యూ డివిజన్ అఖిలపక్షపోరాట కమిటీ సమావేశంలో బుధవారం తీర్మానం చేశారు. అలాగే ఆలేరు పేరుకే అసెంబ్లీ ఆలేరు అన్ని రంగాల్లో విద్యారంగంలో వైద్యరంగంలో పరిశ్రమ రంగాల్లో వ్యాపార రంగంలో పూర్తిగా వెనుకబడిపోతున్నది గత పాలకుల అసమర్థత వలన ఆలేరు పూర్తిగా నిర్వీర్యం అవుచున్నది ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు సబ్ రిజిస్టర్ ఆఫీసు, ఏసిపి ఆఫీసు, ఆర్ అండ్ బి డి ఈ ఆఫీసు, మరియు ఈ మధ్యన ఆలేరుకు రావలసిన మెడికల్ కాలేజ్, 100 పడకల హాస్పిటల్, ఇంటిగ్రేటెడ్ స్కూలు ఇలా



ఒకదాని తర్వాత ఒకటి వేరే ప్రాంతాల తరలిపోవడం వలన ఆలేరు పూర్తిగా నిర్వీర్యమయే ప్రమాదం ఉన్నది కావున ఆలేరు అభివృద్ధి జరగాలంటే రెవిన్యూ డివిజన్ ఏర్పాటు అయితే తప్ప వేరే అవకాశం లేదు గత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్య గారు మేము అధికారుల్లోకి వస్తే 100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగింది. తరువాత జరిగిన గ్రామపంచాయతీ మరియు మున్సిపాలిటీ ఎన్నికలలో కూడా త్వరలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచార సభలో ప్రకటించడం జరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ అధికారులకు వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి కావాల్సింది అయినా ఇంతవరకు ఆలేరు రెవిన్యూ డివిజన్ సంబంధించిన అధికార ప్రకటన రాకపోవడాన్ని ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించుచున్నాము ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రతి ఎన్నికల్లో ఈ అంశం వాడుకొని ఓట్లు దండుకోవడం జరుగుతుంది కానీ రెవిన్యూ డివిజన్ ఏర్పాటు పై చిత్తశుద్ధి లేదు ఆలేరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై కాలయాపనకు నిరసనగా ఈనెల 31వ తేదీ జరిగే ఆలేరు పట్టణ బంద్ మరియు ధర్నా కార్యక్రమానికి పార్టీలకతీతంగా అన్ని పార్టీలు పాల్గొని వ్యాపార సంఘాలు ఉద్యోగ సంఘాలు విద్యార్థి సంఘాలు స్వచ్ఛంద సేవా సంస్థలు అందరూ పాల్గొని ఆలేరు అభివృద్ధి కోసం సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో కన్వీనర్ పసుపునూరి వీరేశం,కో కన్వీనర్ రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, మొరిగాడి చంద్రశేఖర్, కళ్లెపు అడవయ్య, కేమిడి ఉప్పలయ్య, వార్డ్ కౌన్సిలర్ యాట శివ,మీడియా ప్రతినిధి కుర్షిత్ పాషా, వ్యాపార సంఘ ప్రతినిధి కృష్ణ హరి కామిటికారి, అశోక్, నమిలి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు




# విశ్వేశ్వరయ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ విజయవంతం

- విద్యార్హత పొందిన ప్రతి ఒక్కరికి అవకాశం
- రిలయన్స్ ఫౌండేషన్ కళాశాల యాజమాన్యం

**ఇబ్రహీంపట్నం జూలై 22 మహా:** విశ్వేశ్వరయ కళాశాలలోరిలయన్స్ ఫౌండేషన్ మరియు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రైవ్‌కు యువత నుంచి విశేష స్పందన లభించింది. ఇబ్రహీంపట్నం మండలం, ఆదిభట్ల సర్కిల్ పరిధి బొంగుళూరు లోని విశ్వేశ్వరయ కళాశాలలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్ స్కిల్లింగ్ కార్యక్రమాలు, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఉపాధి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నాయి. ఈ రిక్రూట్ మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ సంస్థలైన సదర్లాండ్, సోజిలిటీ, డిజిటైడ్, ఫ్రాంక్లిన్ టెక్ కంపెనీలు పాల్గొని అభ్యర్థుల ఇంటర్వ్యూలను నిర్వహించాయి. వివిధ విద్యార్హతలు కలిగిన యువత తమ ప్రతిభను ప్రదర్శించి ఉద్యోగ అవకాశాల కోసం పోటీపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థల ప్రతినిధులు అభ్యర్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మరియు ఉద్యోగానికి అవసరమైన ఇతర అంశాలను పరిశీలించారు. అర్హత సాధించిన అభ్యర్థులను తదుపరి ఎంపిక ప్రక్రియకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి రిక్రూట్ మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె సుధాకర్, సెక్రటరీ కె లక్ష్మీనారాయణ, ట్రెజరర్ బి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి రమేష్, టిపిఓ జయప్రకాశ్ రెడ్డి, హెచ్ఓడీలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి గిరిప్రదక్షిణ

### పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**యాదగిరిగుట్ట జూలై 22 మహా** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం నాడు నిర్వహించిన గిరి ప్రదర్శనలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు ఈ సందర్భంగా ముందుగా స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేలాది మంది భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ పూర్తి చేసి, కొండపై ఉన్న ప్రధాన ఆలయానికి చేరుకుని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, స్వాతి నక్షత్రం రోజున శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం రాష్ట్రంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకుంటోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ గిరిప్రదక్షిణలో ఆంధ్రప్రదేశ్ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు, అర్చకులు, అలాగే వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



# ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్ కు నిరసనగా ఆలేరులో భారీ ధర్నా రాస్తారోకో

- పాల్గొన్న డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య

**ఆలేరు జూలై 21 మహా** ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ భారతదేశాన్ని అమ్మేయాలని చూస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే,యాదాద్రి భువనగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య అన్నారు... నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు,ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అమానుషంగా విద్యార్థుల పై టి ఆర్ గ్యాస్, లాంటి చార్జింగ్ ని నిరసిస్తూ ప్రధాని ఇంటి ముట్టడికి వెళ్లిన పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో బీర్ల ఐలయ్య నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా, ర్యాలీ రాస్తారోకో నిర్వహించారు.. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం వేణు కాంప్లెక్స్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు.. రాబోయే ఎన్నికల్లో ప్రధాని మోదీని గద్దెదించి కాంగ్రెస్ పార్టీ అధినేత పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడం ఖాయమన్నారు... ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో రైతు వ్యతిరేక, మహిళా వ్యతిరేక విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబించారని ఆయన దుయ్యబట్టారు దళిత,మైనార్టీ,ఎస్టీ, బీసి వ్యతిరేక కేంద్ర ప్రభుత్వానికి చమరగీతం పాడాలని అన్నారు.. బస్టాండ్ నుంచి రైల్వే గేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అక్కడ రాస్తారోకో నిర్వహించారు పోలీసులు జోక్యం చేసుకొని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను అదుపులోకి తీసుకొని రాస్తారోకో విరమింపచేశారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆలేరు పిఎసిఎస్ చైర్మన్ జనగామ ఉపేందర్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, ఆలేరు మున్సిపల్ చైర్మన్ భీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, పలువురు కౌన్సిలర్లతోపాటు ఆలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంధ మల్ల అశోక్, పట్టణ అధ్యక్షుడు కట్టేగొమ్ముల సాగర్ రెడ్డి, జిల్లా నాయకులు ఎజాజ్, పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పిఎసిఎస్ చైర్మన్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# నిజాం నవాబుపై గర్జించిన కలం యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా :** వీర తెలంగాణ విప్లవ సాయుధ పోరాటంలో తమ కలాన్ని గలాన్ని వినిపించిన మహాకవి రచయిత దాశరథి కృష్ణమాచార్యులు అని ఉప్పల్ ఎమ్మెల్యే కొనియాడారు. సైనిక్ పురిలో దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాశరథి కృష్ణమాచార్యులు జైలు గోడలు మధ్య బంది అయిన నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ గర్జించిన మహాకవి అని, త్యాగాలు తెలంగాణ అస్తిత్వం కోసం వారు చేసిన కృషిని తెలంగాణ సమాజం ఎప్పుడు మరువజాలదని బండారు లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం పరిరక్షణ అస్తిత్వ పరిరక్షణ కోసం నాటి నైజాం నవాబును ఎదిరించిన గొప్ప కలం వీరుడని, ఆయన అందించిన స్ఫూర్తి త్యాగం నేటి రేపటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా** : నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ నాయకులు, బుధవారం కుషాయిగూడ చర్లపల్లి ఆయా డివిజ్ ల కార్యకర్తలకు సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఓటు విలువైనదని, అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సంబంధిత అధికారుల ద్వారా వెంటనే సరిచేసుకునేలా సహకరించాలని సూచించారు. బూత్ స్థాయి ఇన్‌ఛార్జీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# పాడేమోసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ఆలేరు జూలై 22 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజిపేట గ్రామానికి చెందిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పిఆర్వో శివ కుమార్ తండ్రి మరణించగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అంతిమయాత్రలో పాల్గొని పాడేమోసి శివకుమార్ ను ఓదార్చి ధైర్యం నింపారు. శివకుమార్ తండ్రి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు.. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులు, గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తాం..
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీం పాషా..

**మొయినాబాద్ మహా:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(TUWJ)నిరంతరం కృషి చేస్తుందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే సంయుక్త విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతన్నారు.జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లైన అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ కార్డుల మంజూరు, కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ, కుటుంబాలకు భరోసానిచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్(ప్రమాద బీమా)సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ డిమాండ్లు నెరవేరే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టులంతా విభేదాలు వీడి ఒకే తాటిపైకి వచ్చి యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీం పాషా మాట్లాడుతూ మండల స్థాయి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థానిక సమస్యల పరిష్కారంపై త్వరలో జిల్లా కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు లేదా అక్రమ కేసులు నమోదైతే యూనియన్ తీవ్రంగా స్పందించి, లీగల్ సెల్ ద్వారా పూర్తి న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో జర్నలిస్టుల కోసం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో చేవెళ్ల నియోజకవర్గంలో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, సూర్యనారాయణ, రమేష్,ఈసీ సభ్యులు ఇలియాజ్ షరీఫ్, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిమోని యాదయ్య, షాబాద్ మండల మాజీ అధ్యక్షుడు పోనమోని రమేష్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, కరుణాకర్ చారి, మల్లేష్ తదితరులున్నారు. షాబాద్ మండల టీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఎన్నిక.. నూతన అధ్యక్షుడిగా దర్పల్లి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏగూరి మల్లికార్జున్. షాబాద్ మండల టీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా దర్పల్లి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏగూరి మల్లికార్జున్, గౌరవ అధ్యక్షుడిగా నాగని రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా కడమంచి నర్సింలు, ఉప్పు శ్రీనివాస్, పోనమోని వెంకటేష్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా బర్క నరేందర్, ముక్కు లక్ష్మణ్, జానంపేట శివరాజ్ గౌడ్, కోశాధికారిగా పూర్ణచందర్ గుప్తా, ఈసీ మెంబర్లుగా చిలకమర్రి అనిల్, రాజేష్, మధు, రాజేందర్, రవి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# పట్నంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం!

- **ఎమ్మెల్యే రంగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన**
- **నీట్ పరీక్ష పత్రం లీక్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం**
- **కేంద్ర మంత్రి రాజీనామా చేయాలంటూ ఆందోళనలు**

**ఇబ్రహీంపట్నం జూలై 22 మహా:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తాలో దేశ ప్రధాని మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మల దహనం చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నేతలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొని మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మలను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ... నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడిన వారిపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయని పరిస్థితిలో దేశవ్యాప్తంగా ఈ అంశంపై నిరసనలు కొనసాగుతాయని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి గౌస్ పాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నాను.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**కార్మిక శాఖ మంత్రికి వినతి పత్రం అందజేసిన. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి.**



. రాజేంద్రనగర్ మహా; తెలంగాణ మున్సిపల్ స్టాప్ & కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామిని రాష్ట్ర ముఖ్యమంత్రితో మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుదల విషయంలో మాట్లాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలను తీసుకెళ్తానని కార్మిక శాఖ మంత్రి చెప్పరు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 6 ప్రకటనతో మున్సిపల్ కార్మికులకు ఈ జీవో అమలు చేస్తే అన్యాయం జరుగుతుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్,మున్సిపాలిటీలలో ఇప్పటికే ఇస్తున్నట్టు వంటి వేతనాల కంటే ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో తక్కువగా ఉన్నాయని వివరించారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెరుగ లేదన్నారు. కార్మిక శాఖ పరిధిలో ఉన్నటువంటి మున్సిపల్ కార్మికుల సమస్యలు సచివాలయంలో లా సెక్రటరీ పాపిరెడ్డి కి యూనియన్ నాయకులకు ప్రభుత్వంతో చర్చలకు ఏర్పాటు చేయాలన్నారు.



# రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

**ఆదిలాబాద్ మహా :** రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామిక చర్యగా ఖానాపూర్ ఎమ్మెల్యే బెడ్మ బొజ్జు పటేల్ అభివర్ణించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. బుధవారం ఉట్నూర్ లోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద నీట్ అంశంపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.దేశ ప్రధాని మోదీ , అమిత్ షాలు విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రయ్య ,ప్రధాన కార్యదర్శి ఇక్బాల్ , ఉట్నూర్ మండల అధ్యక్షులు ప్రభాకర్ ,పట్టణ అధ్యక్షులు నిస్సార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉండాలి


- **ప్రాపర్టీ కేసుల పై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **సీసీటీఎన్ఎస్ 2.0 కేసుల వివరాలు సకాలంలో నమోదు చేయాలి**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
- **దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన ఎస్పీ**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉండాలని ప్రాపర్టీ కేసుల పై ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్పీ రోహిత్ రాజు వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు కార్యాలయ నిర్వహణ రికార్డులు సిబ్బంది నిర్వహిస్తున్న విధులు తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు పెండింగ్ దర్యాప్తుల పురోగతి నేరాల నియంత్రణ చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాపర్టీ కేసుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించి దొంగిలించబడిన ఆస్తులను త్వరితగతిన స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. రౌడీ షీటర్లు హిస్టరీ షీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో నమోదయ్యే కేసులు దర్యాప్తు పురోగతి ఇతర వివరాలను సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మట్కా జూదం కోడి పందాలు పేకాట బెట్టింగ్ గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడితో బాధ్యతగా వ్యవహరించి త్వరితగతిన సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య, ఎస్‌బీ2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐలు శ్యాంప్రసాద్, జగన్మోహన్ చారి, పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అసంపూర్తిగా బి టి రహదారులు

- **పనులు పూర్తి కాకుండానే అంచనా బోర్డులు ఏర్పాటు.**
- **రెండేళ్లుగా నిలిచిన నిర్మాణాలు**
- **నిధులు లేక ముందుకు కదలని పరిస్థితి**
- **ఆందోళనకు దిగుతున్న ప్రజలు**
- **అధికారులు దృష్టి సారించాలని డిమాండ్**



దమ్మపేట ,మహా : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలంలో అసంపూర్తిగా నిర్మాణాలకు నోచుకోని బిటి రహదారులు దర్శనమిస్తున్నాయి. ఐటిడిఎ ద్వారా మంజూరైన బిటి రోడ్లకు ఈ మండలంలో సంబందిత ఐటిడిఎ అధికారులు మచ్చుకైనా కనిపించక పోవడంతో ప్రజలు ఎవరిని అడగాలో తెలియని దుస్థితి ఏర్పడింది. ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు బీటీ రోడ్లుగా మారడం లేదు. గ్రామస్తులు పలుమార్లు విజ్ఞప్తి చేయగా, రెండున్నరేళ్ల క్రితం నిధులతో బీటీ రోడ్లు మంజూరయ్యాయి. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అసంపూర్తిగా పనులు చేసి నిలిపివేశారు.దమ్మపేట మండల పరిదిలో మందలపల్లి సమీపంలో గాంధినగర్ నుండి యస్సీ కాలనీ వరకు , మల్లారం కాలనీ నుడి కార్పెంటర్స్ కాలనీ వరకు , చిల్లగుంపు నుండి లింగాలపల్లి వరకు ,పెద్దగొల్లగూడెం లో ప్రధాన రహదారి నుండి లంక గ్రామాలకు ప్యాకేజీ కింద కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రహదారులు మంజూరయ్యాయి. ఆర్భాటంగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు వెట్ మిక్స్ వరకు పనులు పూర్తి చేశారు. బిల్లుల్లో ఏం జాప్యం జరిగిందోగానీ తారు వేయాల్సిన దశలో వాటిని నిలిపివేశారు.

**ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు :** ప్రభుత్వ మార్పు, బిల్లుల చెల్లింపుల సమస్యల కారణంగా పనులు ఆగిపోయాయని తెలుస్తోంది. దీంతో రెండేళ్లుగా రహదారులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రస్తుతం వెట్ మిక్స్ కంకర రాళ్లు పైకి లేచి దుమ్ము ఎక్కువగా ఎగురుతోంది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బీటీ రోడ్లు పూర్తి చేయాలని ఆందోళన: ఏళ్లుగా పనులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులు కు వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రతిపక్ష నేతలు స్పందిస్తేనే ప్రభుత్వం తమ కర్తవ్యం నిర్వహిస్తుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ రాస్తారోకో..

- **ప్రజాస్వామ్య హక్కుల అణచివేతపై నిరసన..**
- **ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్..**

**మణుగూరు, మహా :** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై దాడి చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మణుగూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశంలో విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన రాహుల్ గాంధీపై అమానుషంగా వ్యవహరించి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజా సమస్యలపై రాజ్యాంగబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అణచివేయాలని ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రతిపక్షాల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా, నిరసనలు వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాహుల్ గాంధీపై నమోదైన కేసులు, అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పిరినాకి నవీన్, కలబోయిన మాధవరావు, కూచిపూడి బాబు, గాండ్ల సురేష్, రహీం పాషా, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇండిగో ఎయిర్ లైన్స్ ఉద్యోగిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నం



**క్యాబ్ డ్రైవర్ ప్రశాంత్ అరెస్ట్.. రిమాండ్ కు తరలింపు..**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఇండిగో ఎయిర్ లైన్స్ లో పనిచేస్తున్న మహిళా క్యాబిన్ క్రూ సభ్యురాలిపై ఓ క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. శంషాబాద్ సర్కిల్ పరిధిలోని సిద్ధంతీ ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల డ్రైవర్ ప్రశాంత్ కుమార్ ని శంషాబాద్ ఎయిర్పోర్ట్ అవుట్ పోస్ట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన ఆలస్యంగా వేలుగులోకి వచ్చింది. బాధితురాలు తన విధులకు హాజరయ్యేందుకు సోమవారం శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు బయలుదేరేందుకు క్యాబ్ ఎక్కింది. డ్రైవర్ ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ రోజు వెళ్లే మార్గాన్ని వదిల పెట్టి, శంషాబాద్ ఎయిర్పోర్ట్ కి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి (నిర్మాణంలో ఉన్న పాఠశాల వద్దకు) తీసుకెళ్లాడు. వాష్ రూమ్ కి వెళ్తానని చెప్పి కారు ఆపి వెనుక సీటులో కూర్చున్న ఇండిగో ఉద్యోగుపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు ధైర్యంగా ప్రతిఘటించి తప్పించుకొని ఎయిర్పోర్ట్ అవుట్ పోస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారల సాయంతో నిందితుడు ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుని కోర్టులో హాజరుపరిచి జుడోషియల్ కస్టడీకి తరలించారు.

# అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలి



**పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ముందుగా వరంగల్ పరిధిలోని ఉర్సుగుట్ట సమీపంలోని హిందూ స్మశానవాటికను సందర్శించి అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం శివనగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని నాలాను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల నిర్వహణ, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి నిల్వలు, మురుగు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి భద్రకాళి బండ్ సమీపంలోని నాలాతో పాటు భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, గడువులు, ఎదురవుతున్న సాంకేతిక సమస్యల పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలి నగరాభివృద్ధికి సంబంధించి చేపడుతున్న ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. వర్షాకాలంలో నీటి పారుదల వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా నాలాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్‌బాబు, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి

# నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**
- **జూలూరుపాడు మండలంలో సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూ సర్వే పనుల పరిశీలన**
- **పడమట నర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ**

**జూలూరుపాడు, మహా:** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూ సేకరణ సర్వే పనులను ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులో ముగించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం జూలూరుపాడు మండలంలో జరుగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూ సేకరణ సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పురోగతిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూలూరుపాడు గ్రామ పరిధిలో మొత్తం 17 ఎకరాల 20 కుంటల భూమికి సర్వే చేపట్టాల్సి ఉందని, అందులో సుమారు 8 ఎకరాలు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూములు ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కొత్తూరు గ్రామంలో కొనసాగుతున్న భూ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, మొత్తం 337 ఎకరాల భూమికి సర్వే చేపట్టాల్సి ఉందని తెలుసుకుని, పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి దశను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వేకు అవసరమైన మార్కింగ్ పనులను ఒక రోజులో పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వెడల్పును 50 మీటర్ల నుంచి 40 మీటర్లకు తగ్గించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రాజెక్టు డిజైన్‌ను సాంకేతికంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ జూలూరుపాడు మండలం పడమట నర్సాపురం గ్రామంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణం, తరగతి గదులు, వంటశాల, విద్యార్థుల వసతి గదులు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉంచిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కిచెన్ షెడ్‌లో పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడిన కలెక్టర్, ఉదయం అల్పాహారం, మెనూ ప్రకారం భోజనం అందుతున్న విధానం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి ఫలితాలు వంద శాతం నమోదయ్యాయని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని బాధ్యతగా తీసుకుని, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వే అధికారులు, రైతులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# 24న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

**వరంగల్, మహా:** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించాయి. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి పారదర్శక వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశాయి. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాయి. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు.




# దొంగతనం కేసులో పాత నేరస్థుడు అరెస్ట్

**పెద్ద మొత్తంలో ఆభరణాలు స్వాధీనం**

**కుషాయిగూడ, మహా :** దొంగతనం కేసులో తప్పించుకొని తిరుగుతున్న ఓ పాత నేరస్థుడు అరెస్టు అయ్యాడు. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్హెచ్ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం జవహర్ నగర్ బి జి ఆర్ నగర్ లోని పోచమ్మ దేవాలయం సమీపంలో మడిగ సత్యనారాయణ (43) నివసిస్తున్నాడు. స్థానికంగా ప్లంబర్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తాళం వేసి ఉన్న ఇల్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడేవాడు. వాహనాలను సైతం ఎత్తుకెళ్లి నంబర్ ప్లేట్లను మారుతూ సొమ్ము చేసుకుంటూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాడు. 11 డిసెంబర్ 2025లో యాప్రాల్ సాయి ఎన్క్లేవ్ ప్రాంతంలో ఇంటి తలుపులు పగలగొట్టి విలువైన వస్తువులు నాలుగున్నర లక్షల నగదును దొంగిలించాలని తెలిపారు. దొంగతనాలకు పాల్పడిన సొమ్ము 32 తులాల బంగారు ఆభరణాలు 270 తులాల వెండి 5 తులాల ప్లాటినం వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇటీవల పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వాహనదారుని విచారించగా దొంగతనం కేసును ఒప్పుకున్నాడు. నిందితుడు మడిగ సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్కు తరలించగా మరో నిందితుడు మాణిక్చంద్ పరారీలో ఉన్నాడని తెలిపారు. నిందితులపై జవహర్ నగర్ కీసర కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో కేసులు ఉన్నాయన్నారు. దొంగతనం కేసును చేదించిన పోలీసుల ను అధికారులు అభినందించారు.

# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాదాబైనామా, భూభారతి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు పేర్కొన్నారు. బుధవారం చెన్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సుల ఫిర్యాదులు, దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకొని పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని కిష్టంపేట గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. రీసర్వే పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగుతున్నాయని, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. రీసర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని, సంబంధిత అధికారులు రైతుల సమన్వయంతో కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మండల తహసిల్దార్ మల్లిఖార్జున్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ పై పార్లమెంట్ ముందు విపక్షాల ఆందోళన

**విద్యార్థుల పై దాడిని నిరసిస్తూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య నిరసన**




**వరంగల్, బ్యూరో మహా ;** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు.ఈ సందర్భంగా నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్. కడియం కావ్య మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను సహించబోము అన్నారు. పేపర్ లీక్‌లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పై ఉందని పేర్కొన్నారు.నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటం కొనసాగుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

## విద్యుత్ మౌలిక సదుపాయాల

# బలోపేతానికి కీలక అడుగు

**రూ.15.4 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు**



**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతం, ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు పాల్గొని బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అభివృద్ధి పనులను ప్రారంభోత్సవ చేశారు. వీరితో పాటు వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజాపాయ్, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, డి ఎఫ్ ఓ నికిత, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత లు పాల్గొన్నారు.ములుగు రోడ్డులోని తెలంగాణ ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయ ప్రగతి భవనం ప్రారంభం, నూతన జిల్లా స్టోర్స్ యూనిట్‌ను మంత్రులు సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు వినియోగదారులకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించడంలో ఈ నూతన భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు.జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహద పడతాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు వరంగల్ జిల్లా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి రవాణా బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా మొత్తం రూ. 15.4కోట్ల వ్యయంతో నిర్మించిన అలాగే నిర్మించ తల పెట్టినా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అందులో భాగంగా వరంగల్ సర్కిల్ కార్యాలయం విద్యుత్ ప్రగతి భవన్ రూ.2.2 కోట్లు, వరంగల్ స్టోర్స్ యూనిట్ - రూ.3 కోట్లు, 33/11 కెవి ఇంటర్ లింక్ లైన్ 4.10 కోట్లు ఖిలా వరంగల్ సబ్ స్టేషన్-రూ.3.5 కోట్లు తో పాటు కలెక్టరేట్ సబ్ స్టేషన్ - 33/11 రూ.2.6 కోట్లతో నిర్మించిన నిర్మించ తలపెట్టిన పనులకు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం తో పాటు శంకుస్థాపనలు కూడా చేయడం జరిగింది. అనంతరం విద్యుత్ ప్రగతి భవనం లో హరిత హారం లో భాగంగా మంత్రులు, జిల్లా కలెక్టర్లు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, ఎస్ ఇ ఆనందం ,,జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఈసీఐఎల్ సీఎండీగా డాక్టర్ కోమల్ కపూర్ బాధ్యతల స్వీకరణ

**కుషాయిగూడ, మహా** అణుశక్తి విభాగం ఆధ్వర్యంలోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ (టెక్నికల్) గా డాక్టర్ కోమల్ కపూర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఉన్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు.

మెటలర్జికల్ ఇంజనీర్ అయిన డాక్టర్ కపూర్ 1989లో బార్క్ శిక్షణా పాఠశాలలో చేరి, అనంతరం ఎన్ఎఫ్‌సీలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాల్లో సేవలందించారు. ఐఐటీ ముంబై నుంచి మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్‌లో డాక్టరేట్ పొందిన ఆయన, హోమీ భాభా నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో అనుబంధ ప్రొఫెసర్‌గా, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకుడిగానూ సేవలందిస్తున్నారు.

అణు ఇంధన రంగంలో విశేష అనుభవం కలిగిన డాక్టర్ కపూర్ దేశంలోని అణు విద్యుత్ కార్యక్రమాల అభివృద్ధికి కీలకంగా పనిచేశారు. రాజస్థాన్‌లోని కోటాలో కొత్త న్యూక్లియర్ ఇంధన ప్రాజెక్టు ఏర్పాటులోనూ ముఖ్యపాత్ర పోషించారు. న్యూక్లియర్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ రంగాల్లో విశేష కృషికి గాను పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న ఆయన పేరుతో 100కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యాయి.





## కరీంనగర్ నడి బొడ్డున భారీ దోపిడీ..

# 66 తులాల బంగారం, లరూ.21 లక్షల నగదు అపహరణ

**కరీంనగర్ మహా :** కరీంనగర్ నగరంలో మరోసారి భారీ దోపిడీ ఘటన కలకలం రేపింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్‌నగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో దుండగులు ఓ వృద్ధుడి ఇంట్లోకి చొరబడి మారణాయుధాలతో బెదిరించి 66 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.21 లక్షల నగదును దోచుకెళ్లారు.బాధితుడు అజ్మత్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో ఎనిమిది మంది వరకు ఉన్న దుండగులు మాస్కులు, గ్లౌజులు ధరించి ఇంటి సందులోకి ప్రవేశించారు. ముందుగా ఇంటి సందులోని లైటును ఆఫ్ చేసిన అనంతరం అజ్మత్ అలీ నోటిని మూసివేసి, ఇంట్లో ఉన్న ముగ్గురు మహిళల నోట్లో గుడ్డలు నొక్కి తుపాకులతో బెదిరించినట్లు సమాచారం. ఈ క్రమంలో అజ్మత్ అలీపై దాడికి కూడా పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దోపిడీ అనంతరం దుండగులు అక్కడే ఒక తుపాకిని వదిలివెళ్లగా, దానిని పరిశీలించిన పోలీసులు అది టాయ్ పిస్టల్‌గా గుర్తించినట్లు సమాచారం. దోపిడీకి వచ్చిన వారంతా హిందీలో మాట్లాడినట్లు బాధితులు వెల్లడించారు. ఘటన జరిగిన తీరును బట్టి చూస్తే దుండగులకు ఇంటి నిర్మాణం, పరిసర ప్రాంతాలపై ముందస్తు అవగాహన ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అజ్మత్ అలీ ప్రతిరోజూ ఇంటి సందులోని లైటును ఆఫ్ చేసి లోపలికి వెళ్లే అలవాటు ఉన్న విషయాన్ని తెలిసిన వారే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దోపిడీ అనంతరం అజ్మత్ అలీ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి రెండు మోటార్‌సైకిళ్లను కూడా దుండగులు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. బైపాస్ రోడ్ వైపు వెళ్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. అయితే దుండగులు అక్కడికి ఎలా వచ్చారు, ఏదైనా వాహనంలో వచ్చి సమీపంలో దిగి నడిచి వచ్చారా లేదా ఇతర మార్గాలను ఉపయోగించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అజ్మత్ అలీకి కరీంనగర్‌లో పలు ప్రాంతాల్లో స్థిరాస్తులు, కమర్షియల్ కాంప్లెక్సులు ఉన్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ఓ బంధువుకు నేర చరిత్ర ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, దోపిడీకి వచ్చిన వారు హిందీలో మాట్లాడటం, ఆ ప్రాంతంతో ఉన్న సంబంధాలను కూడా దర్యాప్తులో భాగంగా పరిశీలిస్తున్నారు. అయితే ఈ అంశాలపై పోలీసులు ఇంకా అధికారికంగా ఎలాంటి నిర్ధారణ చేయలేదు. ఘటనాస్థలంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలు సేకరించాయి. సీసీటీవీ ఫుటేజీలు, మొబైల్ టవర్ డేటా, సాంకేతిక ఆధారాలను విశ్లేషించేందుకు సైబర్ వింగ్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. సీపీ గౌష్ ఆలం పరిశీలన సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు డీసీపీ వెంకట రమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయ్‌కుమార్, సీఐలు రాంచందర్‌రావు, తిరుమల్, పుల్లయ్య తదితరులు ఘటనాస్థలాన్ని సందర్శించారు. బాధితులను కలిసి వివరాలు అడిగి తెలుసుకుని, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.


# డీసీసీ అధ్యక్షులు ఇనగాల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

- **పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు**
- **కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువత భవిష్యత్తును అంధకారం చేస్తోంది**
- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




**హనుమకొండ, మహా ;** ఢిల్లీలో మంగళవారం నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని హనుమకొండ డిసిసి అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు బుధవారం హనుమకొండ డీసీసీ భవన్ వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన 'నీట్' పేపర్ లీకేజీ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఈ భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. డీసీసీ భవన్ వద్ద దిష్టిబొమ్మ దహనం అనంతరం, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ పాల్గొని కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీరితో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్. నాగరాజు, టిపిసిసి మెంబర్లు కుచన రవలి, ఇ.వి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, గ్రంధాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ గుండు సుధారాణి, ఏనుమముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక , కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్, మండల అధ్యక్షులు, హనుమకొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు. భట్టి విక్రమార్క గారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో సామాన్యుల తరపున, విద్యార్థుల తరపున ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ భయపడదని, ప్రజల తరపున పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న 'నీట్' పరీక్ష పేపర్ లీకేజీ కావడం ఈ కేంద్ర ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ పేపర్లు అమ్ముకుంటున్న విద్యా మాఫియాకు ఈ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శించారు. విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిలకడ లేని, అవినీతిమయమైన నేషనల్... టెస్టింగ్ ఏజెన్సీ ని కేంద్రం తక్షణమే రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని, నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

# రాహుల్ గాంధీ చిత్రపటం దగ్ధం చేసిన బిజెపి శ్రేణులు



**భువనగిరి జూలై 22మహా** విద్యార్థుల ముసుగులో విద్వేషాలను రెచ్చగొట్టే విచ్చినకర శక్తులకు, నక్సలైట్లకు పట్టిన గతే పడుతుందని ,బిజెపి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, పడమటి జగన్ మోహన్ రెడ్డి, రత్నపురం బలరాములు ఘాటుగా హెచ్చరించారు... యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటుపై మంగళవారం జరిగిన దాడిని ఖండిస్తూ, బుధవారం పట్టణంలోని ప్రిన్స్ కార్నర్ చౌరస్తాలో బిజెపి నాయకులు పెద్ద ఎత్తున నిరసన ధర్నా చేపట్టి అనంతరం రాహుల్ గాంధీ ఫ్లెక్సీని దగ్ధం చేశారు. సందర్భంగా మాట్లాడుతూ, అసాంఘిక శక్తులతో పార్లమెంటుపై దాడి చేయడమే కాకుండా పోలీసులపై రాళ్లు రువ్విన ప్రతిపక్ష పార్టీల సంఘటన పట్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిజెపి నాయకుల పట్ల వ్యవహరిస్తున్న తీరు పై మండిపడుతూ, కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్..... దాడులకు ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. భరతమాతను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి వస్తుంది అని అన్నారు. కాంగ్రెస్, కాక్రోచ్ జనత,కమ్యూనిస్టులు, ఆమ్ ఆద్మీ ప్రతిపక్ష పార్టీలు ఏకమై పార్లమెంటుపై దాడికి దిగటం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పై ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.ఆర్టికల్ 370 రద్దుకు,నీటి పరీక్షకు సంబంధం ఏమిటి అని ప్రశ్నించారు .ప్రపంచ దేశాలలో నరేంద్ర మోడీ ఘనతను ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారు స్వర్ణలత, తుమ్మల యాస్మిన్ నగేష్ ,రచ్చ శ్రీనివాస్, అచ్చయ్య, చందా మహేందర్ గుప్తా, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కస్తూరి మాధురి, ఆకుతోట రామకృష్ణ, మేడికోటేష్, తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**రాజేంద్రనగర్ మహా ;** నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఎన్ ఎస్ యు ఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు ప్రణయ్, వర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 24న విద్యాసంస్థల బందును విద్యార్థులు యువత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులను ఖండిస్తూ, ఆ ఘటనలపై నిష్పాక్షికంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో వరుసగా జరుగుతున్న అవకతవకలపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థను సంక్షోభంలోకి తీసుకెళ్లిన ఎన్‌టి ఏ ను రద్దుచేసి పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ప్రసాద్, తరుణ్, రుద్రాక్ష, శివ రాథోడ్, సమీర్, సుశాంత్, అన్సారీ, దీక్షిత్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు..

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..


**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ పరిధిలోని ఘన్సిమియాగూడ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్సిమియా గూడ జాతీయ రహదారి 44 ప్తై బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న లారీని వేగంగా వస్తున్న స్విఫ్ట్ కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న అజయ్ కుమార్ (31) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న ప్రసన్నకుమార్కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మల్లారెడ్డికి రక్తంతో లేఖ?

**వైరల్‌గా మారిన వాట్సాప్ పోస్టు**

బిజెపిలోకి వెళతారనేది జోరుగా ప్రచారం

**కుషాయిగూడ, మహా :** మాజీ మంత్రి మల్లారెడ్డిని ఉద్దేశించి ఓ గుర్తుతెలియని కార్యకర్త రక్తంతో లేఖ రాశాడంటూ సోషల్ మీడియాలో, ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ఓ పోస్టు వైరల్‌గా మారింది. అందులో మల్లారెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ప్రత్యర్థి పార్టీల వేదికలపై కనిపిస్తున్నారని, బీఆర్ఎస్ కష్టకాలంలో కార్యకర్తలను విస్మరిస్తున్నారని విమర్శలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని, కార్యకర్తలను ఉద్యోగుల్లా చూస్తూ డబ్బు అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించినట్లు పోస్టులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ సిద్ధాంతాలను అవమానించడం బాధాకరమని, కార్యకర్తలను మరచిన నాయకులు చరిత్రలో నిలవరని ఆవేదన వ్యక్తం చేసినట్లు అందులో ఉంది. అయితే, ఈ లేఖను ఎవరు రాశారు, అది నిజంగా రక్తంతో రాసిందేనా అనే విషయంపై ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. మల్లారెడ్డి కుటుంబం ఢిల్లీలో నరేంద్ర మోడీని కలవడంపై తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించాయి. ఇప్పటికే మల్లారెడ్డి టిడిపి నుండి బిఆర్ఎస్ పార్టీలోకి మారాడు. మల్లారెడ్డి అల్లుడు అయిన మర్రిరాజశేఖర్ రెడ్డి మల్కాజ్గిరి నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మల్లారెడ్డి నరేంద్ర మోడీని కేసీఆర్ను పొగడ్తలతో ముంచేస్తున్నాడు. కెసిఆర్ పార్టీ మారు తే మారొచ్చని మల్లారెడ్డికి ముక్కుసూటిగానే చెప్పారు. మాజీ మంత్రి మల్లారెడ్డి తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజనర్సింహ ఆయా మంత్రులతో టచ్ లో ఉన్నారు. ఇటీవల కాలంలో సరూర్నగర్ లో నిరుద్యోగుల సదస్సుకు మల్లారెడ్డి దుమ్మా కొట్టి రేవంత్ రెడ్డి కార్యక్రమానికి హాజరు కావడంతో పార్టీ శ్రేణుల్లో మల్లారెడ్డి పై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మల్లారెడ్డికి తెలంగాణ ఉద్యమ చరిత్ర లేకున్నా మేడ్చల్ నియోజకవర్గం నుండి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒకసారి మంత్రి పదవిని కూడా అనుభవించారు. ఈయన ఎక్కడ అధికారం ఉంటే అక్కడనే మొగ్గు చూపుతాడు. తమ వ్యాపారాల కోసం రాజకీయాల్లోకి వచ్చాడని ప్రజా సేవ చేయడానికి కాదు అని ఇప్పటికే విద్య వైద్య సంస్థలలో వ్యాపారంలో మునిగి తేలుతున్నాడు. మేడ్చల్ నియోజకవర్గం లో పార్టీ కార్యకర్త ఎర్ర ఇంకుతో లేఖ రాయడంపై చర్చనీయాంశంగా మారింది.



# లెనిన్ జోష్‌ను కొనసాగిస్తాడా?

ఒక విజయంతో వచ్చే ఆత్మవిశ్వాసం నటుడి కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తుంది. చాలా కాలంగా ఎదురుచూసిన హిట్ దక్కితే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అక్కినేని యువ కథానాయకుడు అఖిల్ కూడా అలాంటి దశలోనే ఉన్నాడు. 'లెనిన్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న అఖిల్, ఇప్పుడు అదే విజయపరంపరను కొనసాగించాలనే లక్ష్యంతో తన తదుపరి చిత్రాలపై పూర్తి దృష్టి సారిస్తున్నాడు. అయితే ఈ దశలో ఆయన తీసుకునే నిర్ణయాలే కెరీర్‌కు కీలకంగా మారనున్నాయి.

అఖిల్ సినీ ప్రయాణం మొదటి నుంచే భారీ అంచనాల మధ్య సాగింది. అక్కినేని కుటుంబ వారసుడిగా తెరంగేట్రం చేసిన ఆయనపై ప్రేక్షకులు ప్రత్యేకమైన ఆశలు పెట్టుకున్నారు. అయితే ప్రారంభ చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందించకపోవడంతో తనను తాను నిరూపించుకోవడానికి విభిన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగాడు. ప్రతి సినిమాతో కొత్త అనుభవాన్ని సంపాదించుకుంటూ నటుడిగా తనను మెరుగుపరుచుకునే ప్రయత్నం చేశాడు.

'లెనిన్' విజయం అఖిల్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ఈ విజయంతో ప్రేక్షకుల్లోనే కాకుండా సినీ వర్గాల్లో కూడా ఆయనపై నమ్మకం పెరిగింది. అయితే ఒక హిట్‌ను నిలబెట్టుకోవడం ఏ హీరోకైనా అత్యంత క్లిష్టమైన దశ. అందుకే ఇప్పుడు అఖిల్ ముందు ఉన్న అతిపెద్ద సవాల్ సరైన కథను ఎంపిక చేసుకోవడమే. ప్రేక్షకులకు కొత్తదనం ఉన్న కథలు, బలమైన పాత్రలు, ఆసక్తికరమైన కథనంతో కూడిన సినిమాలే ప్రస్తుతం విజయాన్ని అందుకుంటున్నాయి.ఇప్పటి ప్రేక్షకుల అభిరుచులు కూడా పూర్తిగా మారిపోయాయి. స్టార్ హీరో అనే పేరుతో మాత్రమే సినిమాలు ఆడే పరిస్థితి లేదు. కథ, స్క్రీన్‌ప్లే, పాత్రల బలం, భావోద్వేగాలు, వినోదం అన్నీ సమపాళ్లలో ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అందుకే అఖిల్ కూడా తన తదుపరి సినిమాల్లో కథకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒక సరైన కథ, సరైన దర్శకుడు, బలమైన పాత్ర కలిస్తే హీరో కెరీర్‌ను పూర్తిగా మార్చే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు చేసిన సినిమాల ద్వారా అఖిల్‌కు మంచి అనుభవం లభించింది. తనకు ఏ తరహా పాత్రలు సరిపోతాయి, ప్రేక్షకులు తన నుంచి ఎలాంటి సినిమాలు ఆశిస్తున్నారనే విషయాలపై కూడా స్పష్టత వచ్చినట్లు కనిపిస్తోంది. 'లెనిన్' విజయం తర్వాత ఆ అనుభవాన్ని ఉపయోగించుకుని మరింత పకడ్బందీగా ప్రాజెక్టులను ఎంపిక చేస్తే, కెరీర్‌లో వరుస విజయాలకు బాటలు వేసే అవకాశం ఉంది.

ప్రస్తుతం అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులందరి దృష్టి అఖిల్ తదుపరి చిత్రంపైనే ఉంది. 'లెనిన్'తో వచ్చిన విజయోత్సాహాన్ని ఆయన ఎంతవరకు కొనసాగిస్తారు? మరోసారి ప్రేక్షకులను మెప్పించే కథను ఎంచుకుంటారా? అనే ఆసక్తి నెలకొంది. ఈ దశలో తీసుకునే నిర్ణయాలే అఖిల్ సినీ ప్రయాణానికి కొత్త మలుపు తిప్పనున్నాయి.



# సహజ అందాలతో ఆకట్టుకుంటున్న శివాని నాగారం

టాలీవుడ్‌లో వేగంగా గుర్తింపు తెచ్చుకుంటున్న యువ కథానాయికల్లో శివాని నాగారం ఒకరు. శాస్త్రీయ నృత్యం, సంగీతంలో శిక్షణ పొందిన ఆమెకు చిన్నప్పటి నుంచే కళలపై మక్కువ. తల్లి ప్రోత్సాహంతో ఓ సినిమా ఆడిషన్‌లో పాల్గొన్న శివాని, అనేక మంది పోటీదారుల మధ్య తన ప్రతిభతో దర్శకుల దృష్టిని ఆకర్షించి సినీ రంగంలో అడుగుపెట్టింది. తొలి అవకాశాన్నే సద్వినియోగం చేసుకుంటూ సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

2024లో విడుదలైన 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రంలో సుహాస్ సరసన 'లక్ష్మి' పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. అనంతరం 2025లో విడుదలైన 'లిటిల్ హార్ట్స్' చిత్రం శివాని కెరీర్‌కు మరో కీలక మలుపు తీసుకొచ్చింది. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం విజయంతో యువతలో ఆమెకు విశేషమైన క్రేజ్ ఏర్పడగా, ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డు వంటి ప్రతిష్ఠాత్మక గౌరవాలు కూడా ఆమెను వరించాయి.

నటనతో పాటు శివాని నాగారం తన అందం, అభిరుచి కలిగిన ఫ్యాషన్ సెన్స్‌తో సోషల్ మీడియాలోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. సంప్రదాయ చీరల్లో తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే లుక్స్ నుంచి ఆధునిక దుస్తుల్లో ఆకట్టుకునే స్టైలిష్ ఫొటోషూట్ల వరకు ఆమె ప్రతి ఫొటో అభిమానులను అలరిస్తోంది. సముద్రతీరంలో తీసుకున్న అందమైన చిత్రాలు, సహజమైన చిరునవ్వు, సింపుల్ అండ్ ఎలిగెంట్ స్టైల్ ఆమె వ్యక్తిత్వానికి మరింత ఆకర్షణను తీసుకొస్తున్నాయి. అందం, అభినయం, ఆత్మవిశ్వాసం కలగలిపిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతుంటాయి.

ఎక్కువ సినిమాలు చేయడం కంటే మంచి కథలు, బలమైన పాత్రలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనతో శివాని తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఇటీవల మరోసారి సుహాస్‌తో కలిసి 'హే బల్వంత్' చిత్రంలో నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానుంది. వరుస విజయాలు, విభిన్నమైన పాత్రల ఎంపిక, సహజమైన నటనతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఏర్పరుచుకున్న శివాని నాగారం, దక్షిణాది సినీ పరిశ్రమలో అత్యంత ఆశాజనకమైన యువ కథానాయికల్లో ఒకరిగా వేగంగా ఎదుగుతోంది.



# మెగాస్టార్‌పై ఎస్కేఎన్ ఎమోషనల్ స్పీచ్




యువ హీరో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రీరిలీజ్ వేడుకలో నిర్మాత ఎస్కేఎన్ చేసిన ప్రసంగం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఆయనపై తనకున్న అభిమానాన్ని ఎస్కేఎన్ భావోద్వేగంగా వ్యక్తం చేశారు.

"బాస్ గురించి ఎంత చెప్పినా తక్కువే. కానీ ఆయన ఎదుట నిలబడి మాట్లాడాలంటే గుండె ఆగిపోయినంత పని అవుతుంది. బాస్ అంటే మా జీవితానికి దారి చూపిన వ్యక్తి. ప్రతి ఒక్కరి గుండె 'లబ్ డబ్' అంటుంటే.. మెగా అభిమానుల గుండె మాత్రం 'మెగాస్టార్.. మెగాస్టార్' అని కొట్టుకుంటుంది. అందరి బ్లడ్ గ్రూపులు ఏ, బీ, ఓ అయితే.. మా బ్లడ్ గ్రూప్ మాత్రం 'ఎం' అంటే మెగా" అంటూ సభలో ఉత్సాహం నింపారు.

పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న ఎస్కేఎన్, ఒకప్పుడు శిల్పకళావేదికలో చిరంజీవిని ఒక్కసారి చూసేందుకు ఈవెంట్ పాస్‌ల కోసం పోలీసుల లాఠీ దెబ్బలు కూడా తిన్న రోజులు ఉన్నాయని చెప్పారు. అలాంటి తమలాంటి మధ్యతరగతి యువకులకు చిరంజీవే స్ఫూర్తి అని, ఇప్పుడు తాము నిర్మించిన సినిమా వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా రావడం జీవితంలో మరిచిపోలేని క్షణమని ఆనందం వ్యక్తం చేశారు.

'చెన్నై లవ్ స్టోరీ' గురించి మాట్లాడుతూ.. జాతీయ అవార్డు గ్రహీత సాయిరాజేష్ అందించిన కథను వినగానే కిరణ్ అబ్బవరం వెంటనే అంగీకరించారని తెలిపారు. దర్శకుడు రవి నంబూరి ఈ చిత్రాన్ని హృద్యమైన ప్రేమకథగా తెరకెక్కించారని, సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు సినిమాకు ప్రత్యేక బలంగా నిలుస్తాయని అన్నారు.

చివరగా ఇది కేవలం సినిమా ప్రచార కార్యక్రమం మాత్రమే కాదని, తమ జీవితంలో ఎంతో భావోద్వేగపూరితమైన సందర్భమని ఎస్కేఎన్ పేర్కొన్నారు. కుటుంబమంతా కలిసి చూసేలా రూపొందించిన ఈ చిత్రం ప్రతి ప్రేక్షకుడిని ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బయట తనను గుర్తించి అభిమానులు సెల్ఫీలు తీసుకుంటే అది తన గొప్పతనం కాదని, "వీడు కూడా మనలాంటి ఒక మెగా అభిమాని" అనే భావనతోనే గర్వపడతానని చెబుతూ, జీవితాంతం మెగాస్టార్ చిరంజీవికి, అభిమానులకు రుణపడి ఉంటానని తన ప్రసంగాన్ని ముగించారు.

## బాలీవుడ్‌ను ఎందుకు వీడానో

# చెప్పిన ప్రియాంక

గ్లోబల్ స్టార్‌గా గుర్తింపు పొందిన బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా, హిందీ చిత్రసీమను వీడి హాలీవుడ్ వైపు అడుగులు వేయడానికి గల కారణాలను తాజాగా వెల్లడించారు. కెరీర్‌లో అత్యున్నత స్థాయిలో ఉన్న సమయంలోనే బాలీవుడ్‌కు దూరమవ్వడంపై అప్పట్లో ఎన్నో ఊహాగానాలు వినిపించగా, ఇప్పుడు ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు విషయాలను ఆమె ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

తనకు నచ్చని వ్యక్తులకు అనుగుణంగా మారడం, వారి ఒత్తిడికి తలొగ్గడం తనకు ఇష్టం లేదని ప్రియాంక తెలిపారు. అదే కారణంగా కొన్ని మంచి సినిమా అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇతరులు చేసినట్లు రాజీపడకుండా, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చానని పేర్కొన్నారు.అంతేకాకుండా, కొందరు అగ్ర హీరోలు ఉద్దేశపూర్వకంగానే తనను కొన్ని ప్రాజెక్టుల నుంచి తప్పించారని కూడా ఆరోపించారు. 2007లో 'సలామ్‌ఎ ఇష్క్' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఓ సంఘటనను గుర్తు చేసుకుంటూ, మరో సినిమా విషయంలో తనను కలిసిన హీరో చెప్పిన మాటలు తనను తీవ్రంగా నిరాశకు గురిచేశాయని వెల్లడించారు. "ఈ పాత్ర నిజానికి మరో హీరోయిన్ కోసం అనుకున్నారు. పొరపాటున మీకు వచ్చింది. భవిష్యత్తులో మనం మరో సినిమా చేద్దాం" అని ఆయన చెప్పినట్లు ప్రియాంక వివరించారు.ఇలాంటి సంఘటనలు ఒక్కసారి మాత్రమే కాకుండా పలుమార్లు ఎదురయ్యాయని, వాటిని ఎదుర్కొంటూనే తన ప్రతిభ, కష్టంపై నమ్మకం ఉంచుకుని ముందుకు సాగానని ఆమె తెలిపారు. చివరికి అదే తనకు కొత్త అవకాశాలను తెచ్చిపెట్టిందని, హాలీవుడ్‌లో విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకోవడానికి దోహదపడిందని చెప్పారు. ప్రస్తుతం ప్రియాంక చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాలతో పాటు సోషల్ మీడియాలోనూ విస్తృత చర్చకు దారితీశాయి.





# నిర్మాత కోసం విజయ్ నిర్ణయం మార్చుకున్నారు!

తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన ప్రతిష్ఠాత్మక పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' (తెలుగులో 'జన నాయకుడు') జూలై 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ పూర్తిస్థాయి రాజకీయాల్లోకి ప్రవేశించి సీఎం అయిన తర్వాత విడుదలవుతున్న తొలి చిత్రం కావడం, ఇదే ఆయన చివరి సినిమా అనే ప్రచారం నేపథ్యంలో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

సినిమా ప్రమోషన్లలో భాగంగా నిర్మాత వెంకట్ కె. నారాయణ చెప్పిన ఓ ఆసక్తికర సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినిమా నిర్మాణ సమయంలో ఒక టెక్నీషియన్‌ను మార్చాలని విజయ్ తనకు ఫోన్ చేసి సూచించారని ఆయన వెల్లడించారు. అయితే వెంటనే ఆ నిర్ణయం వల్ల నిర్మాతకు ఆర్థికంగా ఎలాంటి నష్టం జరుగుతుందో విజయ్ స్వయంగా అడిగారని తెలిపారు.

దానికి తాను "కొంత ఆర్థిక భారం పడుతుంది. అయినా నేను చూసుకుంటాను" అని చెప్పగా, నిర్మాతపై అదనపు భారం పడకూడదనే ఉద్దేశంతో విజయ్ వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకుని ఆ టెక్నీషియన్‌ను కొనసాగించాలని సూచించారని వెంకట్ కె. నారాయణ వెల్లడించారు.

నిర్మాతల కష్టాన్ని, వారు పెట్టే పెట్టుబడిని అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకునే హీరోలు చాలా అరుదుగా ఉంటారని, విజయ్ మాత్రం ప్రతి విషయంలో నిర్మాత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తారని ఆయన ప్రశంసించారు. ప్రస్తుతం నిర్మాత చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశంగా మారాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com